
జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 18
సెప్టెంబర్ 16-30, 2018

## 'పౌర సేవల' చట్టం తేకుండానే ఎన్నికలకా?









## కాపు, ముస్లిం కోటా సమస్యకు 'సంస్కరణల పరిష్కారం'...
## తెలుగు రాష్ట్రాల నేతలకు దేశానికి తోవ చూపే గొప్ప అవకాశం



## విభజన హామీలపై సమావేశంలో పాల్గొన్న ఎఫ్‌డీఆర్ బృందం

రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలకు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కి భారత ప్రభుత్వం ఇచ్చిన హామీలపై అధ్యయనం చేసి నిగ్గు తేల్చేందుకు, ఆచరణ సాధ్య పరిష్కారాల్ని చూపుతూ అందుకోసం పార్టీలకతీతంగా కృషి చేసేందుకు జేఎఫ్‌సీ (జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ చొరవతో ఏర్పాటైన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ)కి కొనసాగింపుగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఏర్పాటు చేసిన 'స్వతంత్ర నిపుణుల కమిటీ' (ఐజీఈ) ఇటీవల హైదరాబాద్ 'సెస్'లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) అధ్యయన బృందం.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

సెప్టెంబర్ 16-30, 2018 సంపుటి - 9 సంచిక - 18



మా పార్టీలోకి వెళ్తున్నావా, ఇంద నా చొక్కా తీసుకో, నేను మీ పార్టీ తీర్థం పుచ్చుకో బోతున్నాను. నీ చొక్కా నాకివ్వు.



దాదాపు అన్ని పార్టీలు మారాడట! కొత్త పార్టీకోసం వెతుకుతున్నాడు!!

## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

కాపు, ముస్లిం కోటా సమస్యకు సంస్కరణల....... 5
ముస్లింల వెనకబాటుతనానికి సాంప్రదాయ .......14
ప్రభుత్వోద్యోగాల వైపు ఇంకా పెరిగిన ఆకర్షణ..... 17
'చిన్న ఉద్యోగం - పెద్ద ఉద్యోగం' మైండ్‌సెట్......... 18
స్థితిమంతులకు రిజర్వేషన్లు వద్దు..................... 19
'పౌరసేవల' చట్టం తేకుండానే ఎన్నికలకా?........ 20
అవినీతి నిరోధక చట్టంలో సవరణలు .............. 22
చట్టం కొందరికి చుట్టం.................................. 24
పాత్రికేయ దీపుడు........................................ 26
99.3 శాతం తిరిగొచ్చేశాయ్ !...................... 28
కేరళ బాధితులకు లోక్‌సత్తా పార్టీ చేయూత...... 29
పంచాయతీ ఎన్నికల వాయిదా రాజ్యాంగ ......... 30
(మీడియాలో) 'కీ' కామెంట్లు !........................ 31
అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందితేనే..... 33

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి




# కేవలం ఆకాంక్షలు చాలవు,, అవగాహన. సమన్వయం కావాలి!

పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) వల్ల రద్దయిన నోట్లలో దాదాపుగా (99.3 శాతం) బ్యాంకులకు తిరిగొచ్చేశాయని ఇటీవల రిజర్వు బ్యాంకు వెల్లడించింది. వెల్లడించిందీ అనే కంటే.. మనకు తెలిసిన విషయాన్నే కొన్ని నెలల కాలయాపన అనంతరం ఆర్‌బీఐ మొక్కుబడిగా అంకెలతో బైటపెట్టింది అనుకోవచ్చు. దీంతో అధికారికంగా కూడా నోట్ల రద్దు పరాజయం పరిపూర్ణమైంది. డీమానిటైజేషన్ నిర్ణయం ఆధునిక ప్రపంచ చరిత్రలోనే పెద్ద నిర్ణయాల్లో ఒకటి. ఇన్ని కోట్ల మంది నిత్యజీవితాల్ని నేరుగా తాకి కుదిపేసిన నిర్ణయాలు చాలా అరుదు. తమ జీవితాల్ని అతలాకుతలం చేసినా కూడా ప్రజలు ఎంతో ఓర్చుకుని నరేంద్ర మోదీ ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని కనబరిచారు. రెక్కాడితేగానీ డొక్కాడనివారు, రైతులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతివారు ఇంత బాధని, అనిశ్చితిని ఎందుకు భరించారంటే.. అవినీతి అంతానికి మోదీ ఏదో పెద్ద ప్రయత్నం చేస్తున్నారు, దాని వల్ల దేశానికి పెద్ద మేలు జరుగుతుంది, మనందరం ఆయనకు అండగా ఉండాలి అనే భావన వల్ల! 2016, నవంబర్ 8న మోదీ నోటి నుంచి ఆ ప్రకటన వెలువడుతున్న సమయంలోనే నేను నోట్ల రద్దును స్వాగతిస్తూ ట్వీట్ చేశాను. అయితే కేవలం నోట్ల రద్దు వల్ల అవినీతి పోతుందన్న భ్రమతో కాదు! ఈ పెద్ద అడుగును ఓ అవకాశంగా ఉపయోగించుకుని అవినీతి అంతానికి నిర్దిష్ట చర్యలను ప్రధాని తీసుకుంటారన్న ఆశతో నేను మద్దతిచ్చాను. ఇది పూర్తిగా సమంజసమైన, ఆచరణ సాధ్యమైన ఆశ. కానీ ప్రజలు బ్యాంకుల్లో తాము దాచుకున్న డబ్బును తిరిగి తీసుకోవటానికి కూడా వీల్లేని రీతిలో, కొత్త నోట్లు అందుబాటులో లేకుండానే నోట్ల రద్దును అమలు చేస్తారన్న ఊహ కూడా నాకు తట్టలేదు. అంత అధ్వాన్నంగా, అసమర్థంగా నోట్ల రద్దును అమలు చేయటం వల్ల ఎదురైన పరిస్థితుల్ని చూశాక కూడా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. అతని కంటే ఘనుడు.. అన్నట్టు ప్రతిపక్షాలు వ్యవహరించాయి. 'నాకు నష్టం జరిగినా డబ్బున్నవారి రోగం కుదురుతుంది' అని కోట్లాది మంది మనసుల్లో ఉన్న భావన, తమ అవినీతి డబ్బు బైటపడుతుందేమోనని రాజకీయ నాయకుల్లో పెరిగిన గుబులు మోదీకి పార్టీ ఓట్ల పరంగా గణనీయంగా లబ్ధి చేకూర్చాయి. కానీ ఆర్థికంగా, వ్యవస్థాగతంగా నోట్ల రద్దు దేశానికి పెద్ద నష్టం కలిగించింది. 'ప్రధానమంత్రి కంటే పౌరసత్వం గొప్పది' అని ఢిల్లీ పాలకుల ముందే నిర్మొహమాటంగా చాటిన వాడిని. ఆ పౌరసత్వాన్ని.. తద్వారా ప్రజాస్వామ్యం పటిష్టమయ్యే క్రమాన్ని దెబ్బతీసింది డీమానిటైజేషన్ అమలు తీరు. నోట్ల రద్దు వల్ల నల్లధనమంతా బ్యాంకులకు వచ్చి చేరింది, వారిపై చర్యలు తీసుకుంటాం, పన్ను చెల్లింపుదారుల సంఖ్య మూడు, నాలుగు కోట్ల దాకా పెరిగింది వంటివన్నీ కంటితుడుపు మాటలు. డీమానిటైజేషన్‌పై పాలకుల మాటలకు, చేతలకు సంబంధం లేదనేది వాస్తవం. నల్లధనం వెలికితీత, అవినీతి నిర్మూలన, నకిలీ నోట్ల ఏరివేత.. నోట్ల రద్దు ప్రధాన లక్ష్యాలని మొదట చెప్పారు. తర్వాత డిజిటల్ లావాదేవీల పెంపును జోడించారు. వీటిల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదు. దేశంలో నల్లధనం లేదా? అవినీతి జరగటం లేదా? నకిలీ నోట్లు పెరగటం లేదా?.. అంటే అన్నీ గతంలోలాగానే కొనసాగుతున్నాయి. మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశం కాబట్టి గతంలో బయటికి పోయిన డబ్బుకన్నా.. ఇక ముందు తరలిపోకుండా కాపాడుకోవటం ముఖ్యం. అది కూడా సక్రమంగా జరగటం లేదని, అవినీతి కొత్త రూపు సంతరించుకుంటోందని పరిణామాలు తెలియజేస్తున్నాయి. డీమానిటైజేషన్‌ని ఒక పీడకలలా మర్చిపోవటమేనా? లేక అవినీతిని అంతం చేయాలని మన మనసులో ఎంతో బలమైన ఆకాంక్ష ఉన్నా నోట్ల రద్దు విషయంలో ఎక్కడ బోల్తా పడ్డాం? మోదీ ప్రభుత్వం, ఇతర రాజకీయ పార్టీలు మనల్ని తప్పుదోవ పట్టిస్తుంటే ఎందుకు ప్రతిఘటించలేకపోయాం? అని ఆలోచన చేయటమా?.. కచ్చితంగా మనం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయమిది. మనకు ఆకాంక్షలున్నాయిగానీ, వాటిని నెరవేర్చుకునేందుకు కావలసిన పద్ధతుల గురించిన స్పష్టత లేదు. ఆ అవగాహనాలోపమే సాంప్రదాయ రాజకీయ నేతలకు అవకాశంగా మారుతోంది. మోదీలాంటి వ్యక్తిగత నిజాయతీ నాయకుడు కూడా.. ప్రజలకు తెలియదు కదా అన్నట్టు యథాతథ పరిస్థితిని కొనసాగించటానికే మొగ్గు చూపటంతో మనకు దెబ్బ మీద దెబ్బ పడింది. 'నోట్ల రద్దు అవినీతి అంతానికి తొలి అడుగు మాత్రమే, ఇంత పెద్ద అడుగు వేశారు కాబట్టి.. ఈ ఇతర చర్యల్నీ వెంటనే చేపట్టండి' అని లోక్‌సత్తా పలు సమావేశాల్లో, సోషల్ మీడియాలో ఆచరణాత్మక సంస్కరణల్ని అనేకమార్లు ఏకరువు పెట్టింది. "ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా పౌరసేవలు, పన్ను రేట్లు తగ్గించి ప్రజలు స్వచ్ఛందంగా చెల్లించగలిగే వాతావరణాన్ని ఏర్పరచటం, భూమి విలువ పెంపుతోపాటు రిజిస్ట్రేషన్ ఛార్జీల తగ్గింపు వంటి చర్యలతో రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రక్షాళన చేయటం, భారీ లాలూచీ అవినీతి నియంత్రణకు కఠిన శిక్షలు-ఆస్తుల జప్తు, స్థానిక సాధికారత, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికల, దామాషా పద్ధతితో ఎన్నికల సంస్కరణలు" చేపట్టాలని కోరింది. వీటిల్లో చాలామట్టుకు చేయకపోగా.. ఓ సర్టిఫికెట్ కోసమో, నీటి కనెక్షన్ కోసమో గతి లేక ప్రభుత్వోద్యోగికి లంచం ఇచ్చే ప్రజలకు విధిగా 3 ఏళ్ల నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష.. లంచం తీసుకున్న అధికారిపై మాత్రం విచారణకు పైనుంచి అనుమతి తప్పనిసరి వంటి అసంబద్ధ సవరణల్ని అవినీతి నిరోధక చట్టానికి తీసుకొచ్చారు. డీమానిటైజేషన్ విషయంలో ఎలాగైతే కీలక సంస్కరణలపై నోరు మెదపలేదో, అవినీతి నిరోధక చట్ట సవరణలపై కూడా అలాగే కిమ్మనకుండా అన్ని పార్టీలూ మోదీ ప్రభుత్వ బిల్లును ఆమోదించాయి. జాతీయాదాయం (జీడీపీ) వృద్ధి రేటు గురించిన వివాదం ఇంకో తాజా ఉదాహరణ! జీడీపీ వృద్ధి మోదీ ప్రభుత్వ హయాంలో కంటే.. అంతకుముందున్న యూపీయే ప్రభుత్వ మొదటి పదవీకాలంలోనే ఎక్కువగా ఉందని లెక్కలు చెబుతున్నారు. మేమూ ఏమీ తక్కువ తినలేదన్నట్టు మోదీ బృందం కూడా కొత్త భాష్యాల్ని, లెక్కల్ని వల్లిస్తోంది. జీడీపీ లెక్కల మూలంగా యువతకు ఉపాధి రానప్పుడు, వారి జీవితాల్లో వీసమెత్తు వాస్తవ మార్పు రానప్పుడు, ఎందుకు పట్టించుకోవాలి ఆ లెక్కల్ని? ఉపాధి లేని వృద్ధి ప్రమాదకరమని ఈవేళ మోదీని విమర్శిస్తున్న యూపీయేవాళ్లు.. తమ హయాంలో అంత రికార్డు వృద్ధి వచ్చినప్పుడు ఉద్యోగాల సృష్టిని ఎందుకు జారవిడిచారు? నేను యూపీయేలో జాతీయ సలహా మండలిలో పనిచేసినప్పుడు, బైటికొచ్చాక కూడా ఎన్నోసార్లు ఉపాధి కోసం పలు పరిష్కారాల్ని చెబుతూ అప్రమత్తం చేసినా స్పందించని వాళ్లు.. ఇప్పుడు మోదీని మాత్రమే దోషిగా నిలబెడుతున్నారు. ప్రజలుగా మనం ఆకాంక్షల దశను దాటి, వాటిని సాధించుకునే విధానాల మీద అవగాహనను పెంచుకోవటం, సోషల్ మీడియా వంటి సాంకేతికతను ఉపయోగించుకుంటూ వాటిని ఇతరులతో హేతుబద్ధంగా చర్చిస్తూ సమన్వయం చేసుకుంటూ సంఘటితంగా పోరాడటం మొదలుపెడితేనే ఆ సాంప్రదాయ పార్టీ రాజకీయాల మధ్య మన నిజమైన ప్రయోజనాల్ని పరిరక్షించుకోగలం.

# కాపు, ముస్లిం కోటా సమస్యకు 'సంస్కరణల పరిష్కారం'.. తెలుగు రాష్ట్రాల నేతలకు దేశానికి తోవ చూపే గొప్ప అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లో కాపులకు రిజర్వేషన్ ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి గెలిచారు తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు. ఇప్పుడు కోటా బాధ్యత కేంద్రానిదేనని స్వరం తగ్గించారు. కాపులకు బీసీ పద్ధులో రిజర్వేషన్లు ఇచ్చే వరకూ తాను నిద్రపోనని మధ్య మధ్యలో కలవరించటం మాత్రం మానుకోలేదు. బీసీలు గొడవ చేస్తే.. బీసీలకు నష్టం లేకుండా కాపులకు కోటా ఇస్తామంటున్నారు.



కాపు, ముస్లిం కోటా సమస్యకు 'సంస్కరణల పరిష్కారం'... తెలుగు రాష్ట్రాల నేతలకు దేశానికి తోవ చూపే గొప్ప అవకాశం

తెలంగాణలో ముస్లింలకు రెండంకెల రిజర్వేషన్లు ఇస్తానని హామీ ఇచ్చి గెలిచారు తెరాస అధ్యక్షుడు కె. చంద్రశేఖర రావు. యథావిధిగా బంతిని కేంద్రం కోర్టులోకి నెట్టి ఒత్తిడి మంత్రాన్ని ప్రయోగిస్తున్నట్టు ముస్లింలకు నచ్చచెబుతున్నారు. తమిళనాడుకో నీతి, తెలంగాణకో నీతా? అవసరమైతే తమిళనాడు తరహాలో రిజర్వేషన్లను షెడ్యూల్ 9లో చేర్చేలా పోరాడతామంటున్నారు.

ఎలాగైనా అధికారంలోకి రావాలని ఏపీలో పాదయాత్ర చేస్తున్న వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్.. బీసీలు (కొన్ని అగ్రకులాలు కూడా) వర్సెస్ కాపులు, కాపుల ఓట్లు పవన్ కళ్యాణ్‌కే అనే అంచనాకొచ్చి కాపు రిజర్వేషన్‌పై తాజాగా వెనకడుగు వేశారు. కేంద్రం చేతిలో ఉన్న పనిపై తాను హామీ ఇవ్వనని బీసీల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేశారాయన. అది కొంత వికటించటంతో మళ్లీ కాపు రిజర్వేషన్‌కి అనుకూలంగా మాట మార్చారు.

భిన్నమైన రాజకీయాన్ని అందిస్తానని ఏపీలో ప్రధాన పార్టీలైన తెదేపా, వైకాపాల మీద విమర్శల దాడి చేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా ఏమాత్రం భిన్నత్వం లేకుండా కాపు రిజర్వేషన్లపై పాత రాజకీయం బాటలో హామీని, 9వ షెడ్యూల్ నినాదాన్ని ఎత్తుకున్నారు.

తెలుగునాట కాపు, ముస్లిం రిజర్వేషన్ల రగడ ముదురుతుండగా.. హర్యానా, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో కాస్త సామాజిక స్థిరత్వం సాధించిన కులాలు కూడా రిజర్వేషన్ల కోసం ఉద్యమాల్ని ఉధృతం చేశాయి. వీటికి తోడు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గీకరణ వివాదాలూ రాజుకుంటున్నాయి.

ఇంత జరుగుతున్నా.. రిజర్వేషన్లు అందుకుంటున్న కులాల్లో భరోసాను నింపుతూ, రిజర్వేషన్లే సర్వరోగ నివారిణి అనే భ్రమలో ఎగబడుతున్న కులాలకు ప్రత్యామ్నాయాల్ని చూపుతూ, మొత్తంగా అందరికీ మేలు చేసేలా రిజర్వేషన్లను సంస్కరించే ధైర్యాన్ని మాత్రం రాష్ట్రాల్లో, కేంద్రంలో కూడా అధికారంలో ఉన్న ఏ పార్టీ, ఏ నాయకుడూ చేయలేకపోతున్నారు. ప్రధాన ప్రతిపక్షాలూ ఆ పని చేయలేకపోతున్నాయి. ఇసుకలో తలదాచుకున్న ఉష్ట్రపక్షుల్లా నేతలు వ్యవహరిస్తున్నారు. కులాలకు ఫెడరేషన్లు, భవనాల నిర్మాణం, జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించటం వంటి చిన్న చిన్న పనుల్ని ఘనకార్యాలుగా చాటుకుంటూ మభ్యపెడుతున్నారు.

పలాయనం పరిష్కారం కాదు.. రిజర్వేషన్లపై చర్చిద్దాం, లోక్‌సత్తా చెబుతున్న హేతుబద్ధ పరిష్కారాల్ని పరిశీలిద్దాం, ఆమోదయోగ్య పరిష్కారాలు వచ్చేంతవరకూ చర్చిద్దాం, కచ్చితంగా అమలయ్యేలా చేద్దాం. పార్టీల ఎజెండాను ఈ దిశగా మార్చేందుకు 2018-19 ఎన్నికలను అవకాశంగా ఉపయోగించుకుందాం.

బాబాసాహెబ్ డా॥ అంబేద్కర్, మహాత్మా జోతి బా పూలేలు కులరహిత సమాజాన్ని ఆశిస్తే.. ఈవేళ మన దేశంలోని కులాలు అధికార రాజకీయ క్రీడలో పావులుగా మారుతున్నాయి.

ఉమ్మడి సమస్యల పరిష్కారం కోసం సంఘటిత మవకుండా.. ఉన్న కొద్దీ విడిపోతూ ఒక్కో కులం ఒక్కో అస్తిత్వాన్ని సంతరించుకోవటం మీద దృష్టి పెడుతున్నాయి.

దీంతో కులరహిత సమాజం లక్ష్యం కాస్తా.. ఓటుబ్యాంకు కులాల సమాజం తయారీగా మారింది.

'గడప లోపల కులం-గడప దాటితే మతం' వంటి భావాల్ని నాటుతూ జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న పార్టీ చేస్తున్న సామాజిక రీ ఇంజినీరింగ్.. కులరహిత రాజకీయాల్ని ఉన్నకొద్దీ వెనక్కినెట్టే ప్రయత్నం చేస్తోంది. తెలుగునాట పాలకులు కులాలవారీగా భవనాల్ని నిర్మించి ఇస్తున్నారు, వృత్తులకు కులం ఉండాల్సిందేనంటూ కులవృత్తుల పేరుతో ప్రత్యేకించి ప్రోత్సహిస్తూ రాయితీల్ని అందిస్తున్నారు. దీంతో.. అసలే సున్నితమైన రిజర్వేషన్ల అంశం ఇంకా ఇంకా రాజుకుంటోంది.

సృజనాత్మక విధ్వంసం జరిగి ఓ గొప్ప పరిష్కారమేదైనా వచ్చే అంశమైతే, రిజర్వేషన్ల వివాదంలోని వేడిని ప్రోత్సహించ వచ్చు. కానీ ఇందులోని వేడి స్వార్థరాజకీయాలకు మాత్రం ఉపయోగపడుతూ ప్రజాప్రయోజనాలను దహించివేసే రకం. అందుకే వేడిని చల్లార్చి వెలుగును పంచే ఆలోచనను పెంచటం ఇప్పుడు జరగాల్సిన పని. రిజర్వేషన్లు-వాటాలపై కొట్టుకోవటం కాకుండా, రిజర్వేషన్ల విధానాన్ని అందరికీ అనుకూలంగా సంస్కరించటం ఎలా? అన్నదే ఇప్పుడు మన ప్రాధాన్యాంశం కావాలి. ఇందుకోసం, హేతుబద్ధ ప్రమాణాలతో చర్చిస్తూ కనీసం చూడగలిగినంత ముందుచూపుతో ఆచరణాత్మక పరిష్కారాల్ని సాధించుకోవాలి.

దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల కోసం కొందరు బాగా స్థిరపడిన కులాల వారి నుంచి కూడా డిమాండ్లు వస్తుండటంతోపాటు, రిజర్వేషన్లు అమల్లో ఉన్న కులాలవారిలో కూడా అసంతృప్తి పెరుగుతోందన్నది వాస్తవం. ఇతర కులాలు తమ అవకాశాలను తన్నుకుపోతాయేమోనన్న భయాన్ని రిజర్వేషన్ ఉన్న కులాలవారిలో కలిగించి రాజకీయ పార్టీలు తాత్కాలికంగా వారిలో ఉన్న అసంతృప్తిని పక్కదోవ పట్టిస్తూ వస్తున్నాయి.

మరోవైపు, తమకు అవకాశాలు దక్కకపోవటానికి కొన్ని కులాలకు రిజర్వేషన్లు ఉండటమే కారణమనే భావాన్ని అగ్రకులాలుగా చెప్పబడుతున్న వారిలో కూడా రెచ్చగొడుతున్నాయి. రాజస్తాన్‌లో గుజ్జర్లు-మీనాలు, గుజరాత్‌లో పాటిదార్లు, హర్యానాలో జాట్‌లు, మహారాష్ట్రలో మరాఠాల ఘర్షణలు, తెలుగు రాష్ట్రాల్లో కాపు, ముస్లిం రిజర్వేషన్లు, ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ వర్గీకరణ ఆందోళనలు ఇందుకు ప్రధాన ఉదాహరణలు.

స్థానికంగా కొన్ని ప్రాతిపదికల్లో, సమస్యల స్థాయిల్లో తేడా ఉన్నా.. కుల వివక్ష, దుష్పరిపాలన దేశవ్యాప్తంగా ఒకటే కాబట్టి, రిజర్వేషన్ల సమస్యకు పరిష్కారాల్ని స్థూలంగా దేశమంతటికీ ఒకేలా వర్తింపచేయవచ్చు. అందుకే ప్రతి రాష్ట్రం గురించీ వివరంగా కాకుండా కేవలం తెలుగు రాష్ట్రాల కోణంలో కొంత సమగ్రంగా చర్చిద్దాం.

**కాపులు, ముస్లింలకు కోటా హామీ**

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తొలి ముఖ్యమంత్రులైన ఎన్. చంద్రబాబు నాయుడు, కె. చంద్రశేఖర రావు ఇద్దరూ 2014 ఎన్నికలలో రిజర్వేషన్లను రాజకీయ లబ్ధి కోసం వినియోగించుకునే ప్రయత్నం చేశారన్నది వాస్తవం. పెరుగుతున్న నిరుద్యోగాన్ని పరిష్కరించగల రాజకీయ విధానాన్ని చూపలేక.. కాపులను బీసీలలో చేర్చి రిజర్వేషన్ కల్పిస్తానని చంద్రబాబు, వెనకబడిన ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లిస్తానని, ఎస్టీలకు కోటా పెంచుతానని కేసీఆర్ హామీలిచ్చారు. వారు ఎన్నికలలో గెలవటానికి ఆ హామీలు ఉపయోగపడ్డాయనటంలో సందేహం లేదు. కానీ కులం ప్రాతిపదికగా ఉన్న పరిమితమైన రిజర్వేషన్లతో కాపులు, ముస్లింలు, ఎస్టీలలో ఉన్న అపారమైన వెనకబాటుతనాన్ని తొలగించటం సాధ్యం కాదని, ఇతర కులాలవారు కూడా ఉద్యోగాల కోసం ఇదే మార్గంలోకి రావడం మొదలుపెడితే కులాల కురుక్షేత్రం మొదలై తెలుగు రాష్ట్రాలు నష్టపోతాయన్న ప్రమాదకర వాస్తవాన్ని వారు విస్మరించారు. ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని వెతికే చొరవ చూపకుండా తేలిగ్గా అధికారం పొందే అడ్డదారుల్ని ఆశ్రయించారు. అధికారం యొక్క అసలు లక్ష్యాన్ని గాలికొదిలేశారు.

మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కూడా అసంబద్ధ రాజకీయ విధానాల్నే వారు కొనసాగిస్తున్నారు. వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ వ్యూహాత్మకంగానే అయినా కాపు రిజర్వేషన్లపై తన ధోరణిని కొంత మార్చుకున్నా, అందులోనూ పరిష్కారం లేదు. కేవలం కేంద్రం పరిధిలోని అంశం కాబట్టి తాను హామీ లేకపోతున్నానని చెప్పి చేతులు దులుపుకోవాలని ఆయన ప్రయత్నించారు. కాపు కులస్తుల ఓట్లలో ఎక్కువశాతం ఎలాగూ పవన్ కళ్యాణ్ పార్టీకే పడే అవకాశం కనిపిస్తోంది కాబట్టి.. కాపు రిజర్వేషన్ వల్ల తమకు నష్టం జరుగుతుందనుకుంటున్న

## ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న యువత సంఖ్యా తగ్గిపోతోంది

ఉపాధి అవకాశాలు తగ్గిపోవటానికి పెద్ద నోట్ల రద్దు ఒక కారణం అయినప్పటికీ, అంతకు ముందు కూడా పరిస్థితి అంత ఆశాజనకంగా లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. 2017 జనవరి-ఏప్రిల్ మధ్య సంఘటిత, అసంఘటిత రంగాల్లో మొత్తం 15 లక్షల ఉద్యోగాలు అదృశ్యమయ్యాయని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) తెలిపింది. అయితే, పెద్ద నోట్ల రద్దు కంటే ముందే అసంఘటిత రంగంలో ఉద్యోగాల సృష్టి స్తంభించిపోయిందని జాతీయ నమూనా సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) 2015-16 నివేదిక వెల్లడించింది. విచిత్రమైన అంశమేమంటే, ఎలాగూ ఉద్యోగాలు రావన్నట్టు.. ఉద్యోగాల కోసం వెతికే యువత సంఖ్య కూడా తగ్గిపోతోందట. 2017 జనవరిలో 2.59 కోట్లుగా ఉన్న నిరుద్యోగుల సంఖ్య జులై కల్లా 1.37 కోట్లకు తగ్గిందని సీఎంఐఈ లెక్కేసింది. ఉద్యోగాల కోసం వెతకటం మానేసినవారు ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి పేద రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి వారు చట్టవ్యతిరేక కలాపాలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, నిరుద్యోగ భృతి వంటి చిట్కాలతో తప్పించుకోకుండా ప్రభుత్వం ఉపాధిపై అత్యవసర దృష్టి పెట్టాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

బీసీల (కొన్ని అగ్రకులాల) ఓట్లనైనా లాగాలని జగన్ ఇలా రూటు మార్చారని అంచనా వేస్తున్నారు. భిన్నమైన రాజకీయాన్ని అందిస్తానంటూ తెదేపా, వైకాపా మీద విమర్శల్ని ఎక్కుపెడుతున్న జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ కూడా కాపు రిజర్వేషన్‌పై పాత రాజకీయం ధోరణితోనే మాట్లాడారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోకి ముందస్తుగా విడుదల చేసిన దార్శనిక పత్రంలో రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో ఉంచటం ద్వారా కాపులకి రిజర్వేషన్‌ని అందిస్తానని హామీ ఇచ్చారు. కులనిర్మూలన కాకుండా కులాల మధ్య సయోధ్యకు ప్రయత్నిస్తానని చెప్పారు.

ముస్లింలకు రిజర్వేషన్ హామీ ఇచ్చింది తమ పార్టీయేనని, తాము అధికారంలోకి వస్తే సాధించి తీరుతామని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కూడా హామీ ఇస్తోంది. బీజేపీ మరో రకమైన ఎన్నికల రాజకీయ కారణంతో ముస్లిం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోంది తప్ప.. కులం ఆధారిత రిజర్వేషన్లను హిందూయేతర మతానికి వర్తింపచేయటంలోని అహేతుకతల్ని చర్చించటం, రిజర్వేషన్ల లోపల ఉన్నవారి అసంతృప్తిని, బయట ఉన్నవారి డిమాండ్లను పరిష్కరించే ప్రయత్నం చేయటం కనిపించదు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి భిన్నంగా బీజేపీ నేతలు తెలంగాణలో స్టాండ్ తీసుకోలేదు.

మొత్తంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన పార్టీలుగా బరిలో ఉన్నవారందరి వైఖరి కూడా ఈవేళ రిజర్వేషన్ సంక్షోభాన్ని ఇంకా జటిలం చేసేలా ఉందే తప్ప పరిష్కరించేదిగా లేదు. అందరికీ నాణ్యమైన విద్యను అందించటంపై జరగాల్సిన చర్చను కేవలం రిజర్వేషన్ల చుట్టూ తిప్పటం వల్ల ఇన్నాళ్లుగా జరుగుతున్న నష్టాన్ని గుర్తించి తెదేపా, తెరాస, వైకాపా, కాంగ్రెస్, జనసేన, ఇతర పార్టీలు, పౌర సంస్థలు, నేతలు గనక రిజర్వేషన్లపై విజ్ఞతను ప్రదర్శిస్తే, విద్యాసంస్థల్లో, ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లపై ఆచరణాత్మకంగా, అందరికీ న్యాయం చేయాలన్న దృష్టితో ఆలోచిస్తే.. యావత్ దేశానికే ఒక పరిష్కార మార్గం చూపే గొప్ప అవకాశం తెలుగు రాష్ట్రాల సొంతమవుతుంది. వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా కూడా పార్టీలకు లబ్ధి చేకూరుతుంది.

### కాపు, ముస్లిం రిజర్వేషన్లు ,, నేపథ్యం, పరిస్థితి

కాపుల రిజర్వేషన్ విషయానికొస్తే, ఆ కులస్తుల్లో వెనకబాటుతనం ఇంకా కొనసాగుతున్న మాట వాస్తవం. 1910 నుంచి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రారంభమైన మాంటేగ్-చెమ్స్‌ఫోర్డ్ సంస్కరణల నివేదిక (1919)లో, ఆ తర్వాత భారత ప్రభుత్వ చట్టం 1935లోనూ కాపు, బలిజ, ఒంటరి మిగిలిన 20 ఉప కులాలున్న ప్రత్యేక జాబితాగా (ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో) కాపులకు రిజర్వేషన్లు 1953 అక్టోబర్ 1 వరకు కొనసాగాయి. మరొక ప్రత్యేక జాబితాగా తెలంగాణ (హైదరాబాద్ రాష్ట్రం)లోనూ కాపులకు రిజర్వేషన్లు అమలయ్యాయి. అయితే 1956లో నీలం సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏ విధమైన కమిషన్, కమిటీ సిఫార్సులు లేకుండానే కోస్తా కాపు, బలిజ, ఒంటరి, తెలగ, గాజుల బలిజలను రిజర్వేషన్ల జాబితా నుంచి తప్పించారు. కోస్తా కాపులను తప్పించి, తూర్పు కాపులకు, తెలంగాణలో మున్నూరు కాపులకు మాత్రం రిజర్వేషన్లు కొనసాగించేలా దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే కులస్తుల్ని కొన్ని ప్రాంతాల్లో ఓసీలుగా, మరికొన్ని ప్రాంతాల్లో బీసీలుగా గుర్తించారు. ఆ తర్వాత కాపులు చేసిన అనేక పోరాటాల ఫలితంగా కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1994లో జీవో నెంబరు 30 విడుదల చేసి కాపులకు రిజర్వేషన్లు

## నిరుద్యోగుల సైన్యాన్ని తయారుచేస్తున్న విద్యావ్యవస్థ

మన విద్యావ్యవస్థ నిరుద్యోగ గ్రాడ్యుయేట్ల సైన్యాన్ని తయారుచేస్తూ అభద్రతను పెంచుతోంది. ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) 2017 సర్వే ప్రకారం.. 15-29 సంవత్సరాల మధ్య ఉన్న భారతీయుల్లో 30 శాతం ఉపాధి లేక ఖాళీగా ఉన్నారు. 2018 ఫిబ్రవరి నాటికి భారత్‌లో 3.1 కోట్ల మంది యువ నిరుద్యోగులున్నారని సెంటర్ ఫర్ మానిటరింగ్ ది ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) తెలిపింది. 2018లో కేవలం 6,00,000 ఉద్యోగాలు వస్తాయనేది నిపుణుల అంచనా. కేవలం ఉపాధి కోసం 2016లో ఉత్తర భారతదేశంలో ఓ వారం పాటు జరిగిన ఆందోళన వల్ల రూ.20,000 నుంచి 34,000 కోట్ల ఆర్థిక నష్టం వచ్చినట్టు లెక్కేశారు. ఉపాధినివ్వలేని చదువులు, వృద్ధి రిజర్వేషన్ల సమస్యను జటిలం చేస్తూ ఓటుబ్యాంకు రాజకీయాలను పెంచుతున్నాయి. వచ్చిన ఉపాధిలోకకూడా నైపుణ్యాలను నిరంతరం పెంచుకుంటేనే కొనసాగే అవకాశాలుండటం వల్ల అధ్వాన్న చదువుల వ్యవస్థ ఇప్పుడు దేశానికి పెద్దసవాలుగా మారింది. 2015-16 గణాంకాల ప్రకారం భారత్‌లో నైపుణ్యం కలిగిన కార్మిక శక్తి లభ్యత 4.69 శాతం మాత్రమే. ఆ సంఖ్య అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికాలో 52, బ్రిటన్‌లో 68, జర్మనీలో 75, జపాన్‌లో 80, దక్షిణ కొరియాలో 96 శాతం.

కల్పించారు. ఆ జీవోని హైకోర్టు సమర్థించినా దాన్ని అమలుచేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. ఆ జీవోని వ్యతిరేకిస్తూ బీసీ సంఘాలు కోర్టుల్లో అనేక వ్యాజ్యాలు వేశాయి. అయినా కూడా 1994-95లో ఇచ్చిన హైకోర్టు తీర్పుని అమలు చేయాలని జనవరి 5, 2007న జస్టిస్ రోహిణి నేతృత్వంలో తీర్పు వెలువడింది. ఆ తీర్పునికకూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆ నేపథ్యంలో, రిజర్వేషన్లపై ఎన్నికల హామీనిచ్చి చంద్రబాబు దాటవేత ధోరణిని అవలంబించటం ఇంచుమించు ఆంధ్రప్రదేశ్ జనాభాలో 27శాతంపైగా ఉన్న కాపుల ఆగ్రహానికి కారణంగా మారింది. కాపులు-బీసీల మధ్య చిచ్చుపెట్టటం, లేదా కొందరు కాపు నేతలు సూచిస్తున్నట్లు, ముస్లింలకు 'ఈ' కేటగిరీలాగా (దీంతో కలిపి బీసీ రిజర్వేషన్లు 29శాతం అయ్యాయి), కాపులకు 'బీసీ-ఎఫ్' కేటగిరిని ఇవ్వటం భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో హెచ్చరిస్తూ లోక్‌సత్తా కొన్ని నిర్దిష్ట పరిష్కారాలను సూచిస్తూ వస్తోంది. వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం కాపులతోపాటు 17కులాలను బీసీల్లో చేర్చే అంశాన్ని అధ్యయనం చేయటానికి కమిషన్ వేసినప్పుడు కూడా 2007, డిసెంబర్ 20న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్పష్టమైన ప్రకటన చేస్తూ ఆ ప్రయత్నం తగదని వారించారు. కొత్తగా కోటాలకు బదులు రిజర్వేషన్లపై కాపులకు, బీసీలకు, ఇతర కులాల్లోని పేదలందరికీ కూడా న్యాయం జరిగేలా కొన్ని రిజర్వేషన్ సంస్కరణల్ని సూచించారు. 2014 ఎన్నికల సమయంలో కూడా చంద్రబాబు, కేసీఆర్‌లకు కూడా ఈ అంశాల్ని జేపీ సూచించారు. అయితే పాలకులు కులాల కురుక్షేత్రం వైపే మొగ్గుచూపారు. కాపుల రిజర్వేషన్‌పై ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ ముద్రగడ పద్మనాభం ఆందోళన చేశాక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాపులకు బీసీ కోటాలో రిజర్వేషన్లు కల్పించేందుకు జస్టిస్ మంజునాథ కమిషన్‌ని వేసింది. ఈ కమిషన్ కేవలం కాపుల రిజర్వేషన్ కమిషన్ కాదని, ఇది బీసీ కమిషన్ అని చంద్రబాబు స్పష్టంచేశారు. అన్ని బీసీ కులాల స్థితిగతులను అధ్యయనం చేసి వివరాలను అందిస్తుందన్నారు. కాపులకు రిజర్వేషన్ అందించాలని కమిషన్ నివేదిక ఆధారంగా చంద్రబాబు ప్రభుత్వం తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపింది.

ఇక ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు, ఎస్టీలకు పెంపు విషయంలో తెలంగాణ సర్కారు కూడా ఏపీ ప్రభుత్వం చేసినట్టే బండిని ముందు, గుర్రాన్ని వెనక కట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీకనుగుణంగా నివేదిక కోసం ఎస్టీలపై చెల్లప్ప, మైనారిటీలపై సుధీర్ కమిషన్లను నియమించింది. తెలంగాణ గిరిజనులు, ముస్లింలు సామాజికంగా-ఆర్థికంగా, విద్యారంగంలో వెనుకబడి వున్నారని ఈ కమిషన్ల నివేదికలు తేల్చాయి.

చెల్లప్ప కమిషన్ ఎస్టీలపై రెండు సంపుటాలుగా నివేదికను ఇచ్చింది. సుధీర్ కమిషన్ 300 పేజీలతో నివేదిక ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ఉన్నత వర్గాల సామాజిక, ఆర్థిక, విద్య, ఇతరత్రా పరిస్థితుల్ని పరిగణలోకి తీసుకుంది. వారితో పోలిస్తే ముస్లింలు ఏరకంగా వెనుకబడివున్నారో తెలుసుకుంది. ముస్లింలు చదువులో బాగా వెనుకబడివున్నట్టు కమిషన్ గుర్తించింది. ఒకటి నుంచి పది వరకు చదువుతున్నప్పటికీ, ఆ తరువాత డ్రాపవుట్లు, అసంఘటిత రంగంలో చిన్నచిన్న పనులతో జీవనోపాధి పొందుతున్నట్టు తేలింది. బ్యాంకులు రుణాలివ్వకపోవటంతో ముస్లింలలో ఎక్కువమంది ప్రైవేటు వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడుతున్నారు. చాలామంది ముస్లింలకు

## శ్రీరాముడి వారసులమని విశ్వసించే పాటీదార్లు

ఆర్థిక వెనుకబాటుకు గురైన తమకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఆందోళనలు చేస్తున్న పాటీదార్లు గుజరాత్‌లో బలమైన సామాజిక వర్గం. ఒకే నేపథ్యం నుంచి వచ్చి రెండు కులాలుగా, అనేక ఉపకులాలుగా పరిణామం చెందారు.

అగ్రకులస్తులుగా భావిస్తున్న పటేల్ సామాజిక వర్గం గతంలో శూద్రుల్లోని ఉన్నత శ్రేణికి చెందినది. 6 కోట్ల జనాభా ఉన్న గుజరాత్‌లో ఈ సామాజిక వర్గంవారే 1.5 కోట్ల మంది. మొత్తం 182 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 70-80 స్థానాల్లో ఈ వర్గం ప్రభావం చూపుతుంది. నిర్మా, కాడిలా హెల్త్, లింకన్ ఫార్మాస్యూటికల్స్, సుజ్లాన్ గ్రూప్, హరేకృష్ణ డైమండ్స్ వంటి ప్రసిద్ధ సంస్థల అధినేతలు ఈ సామాజిక వర్గం వారే. సిరామిక్ పరిశ్రమలో వీరిదే గుత్తాధిపత్యం.

పాటీదార్లు అంటే సాగుభూమిని కలిగినవారని అర్థం. రైతులు భూమిని సాగు చేసుకోవడానికి పాలకుల అనుమతి పొందటం అన్నది మధ్యయుగ కాలం నుంచీ వస్తున్నదే. బ్రిటీష్ పాలకులు గుజరాత్‌లో భూ సంస్కరణలు ప్రవేశపెట్టే నాటికి కాన్బీ సామాజికులు రైతులుగా, కోలీలు సైనికులుగా ఉండేవారు. మధ్య గుజరాత్, సౌరాష్ట్రలలో ఈ రెండు వర్గాల వారిది అప్పుడు సమాజంలో సమాన హోదానే. ఆంగ్లేయుల పన్ను విధానాలు ఈ పరిస్థితిని మార్చివేశాయి. ఒక విధానం ప్రకారం గ్రామంలోని భూమిని అంతా ఒకే రెవెన్యూ యూనిట్‌గా పరిగణించి ఒక కులం వారికి అప్పగించేవారు. పన్ను వసూలు అక్కడి నుంచే జరిగేది. ఈ విధానాన్ని కాన్బీ సామాజిక వర్గం ఎంచుకుంది. కోలీలు అధికంగా ఉన్న గ్రామాలు మాత్రం రైతులవారీగా భూమిని తీసుకుని భూస్వామికి పన్ను చెల్లిస్తుండేవారు. కాలక్రమంలో కాన్బీ గ్రామాలు పన్ను చెల్లింపులో, అధికోత్పత్తి సాధించటంలో పై చేయిని సాధించాయి. భూస్వాములకు పన్నులు చెల్లించలేక కోలీలు ఆర్థికంగా చితికిపోయారు. గ్రామంలోని బీడు భూములను ఆంగ్లేయులు కాన్బీలకే అప్పగించడంతో వారు సంపన్నులుగా ఎదిగారు. 20వ శతాబ్దంలో ఆర్థిక స్తోమత, రాజకీయ ప్రాబల్యం కలిగిన కాన్బీల్లోని ఉన్నత వర్గం శూద్రుల నుంచి విడివడి ఆపై స్థాయిలోని వైశ్యులతో సమాన హోదా పొందారు. కోలీలు మరింత బలహీనపడి సామాజిక హోదాను నిలుపుకోలేకపోయారు. 1931 కులాల ఆధారిత జనగణన కాన్బీలను తొలిసారిగా పాటీదార్లుగా గుర్తించింది.

పాటీదార్లలో అనేక ఉపకులాలు ఆవిర్భవించాయి. సీతారాముల కుమారులైన లవకుశులు తమ పూర్వీకులని లువా, కుద్వా కులాలవారు పేర్కొంటారు. లువా వర్గీయులు లవుడి వారసులు కాగా, కద్వాలు కుశుడి వంశీకులు. అంజనా, సత్పంతి, చౌదరి, కోలి అనేవి కూడా పాటీదార్లలోని ఉప కులాలే. ఆ తర్వాత క్రమంలో పాటీదార్లు తమ ఇంటి పేరులో 'పటేల్'ను చేర్చుకున్నారు. గ్రామంలో బ్రిటీష్ పాలకుల తరపున రెవెన్యూ వసూళ్లు వీరి ప్రత్యేక బాధ్యత. శ్రీకృష్ణుని ఆరాధకులుగా మారిన పాటీదార్లు అమ్మ దేవతలనూ పూజించటం ప్రారంభించారు. పూర్తి శాకాహారులుగా మారి, ఆచార వ్యవహారాల్లో బ్రాహ్మణులను అనుకరించసాగారు. తమను ఓబీసీల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్న హార్దిక్ పటేల్ కద్వా పాటీదార్ల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి.

సొంత ఇళ్లు లేవు. ఈ సర్వేను సీజీజీ తోడ్పాటుతో 15వేల శాంపిల్లతో చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో ముస్లింలకు కనీసం 9శాతం, గరిష్టంగా 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్ తన నివేదికలో సిఫార్సు చేసింది. దీనికనుగుణంగా కేసీఆర్ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలన్న తన హామీని నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

### తమిళనాడు నమూనాలో ఇవ్వడం సాధ్యమా?

కాపు, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించి, ఎస్టీల రిజర్వేషన్‌ని పెంచితే ఏపీ, తెలంగాణల్లో రిజర్వేషన్ కోటాలు సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిమితిని దాటేస్తాయి. కాబట్టి పెంపు చాలా కష్టం. అయితే తమిళనాడుకున్న మినహాయింపును తమకు కూడా ప్రత్యేక చట్టంతో వర్తింప చేసుకుని హామీల్ని నెరవేర్చినట్టు చూపించుకోవాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పావులు కదుపుతున్నాయి. తమిళనాడు ప్రభుత్వం చేస్తున్నట్టు.. న్యాయసమీక్షకు అవకాశం లేకుండా రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి కోటాను పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. కేసీఆర్ ఈ విషయాన్ని ఇంకా దూకుడుగా చెబుతుండటంతో పాటు.. తాను చేసిన ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనకు కూడా దీనికి జోడిస్తున్నారు. రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్రాలకే ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.

## మరాఠా మంటలు

తమకూ రిజర్వేషన్లు కల్పించాలని మహారాష్ట్రలో ఆందోళనలు చేస్తున్న మరాఠాల జనాభా ఆ రాష్ట్రంలో 35 శాతం దాకా ఉంది. వారికి రిజర్వేషన్లు కల్పించటానికి అక్కడ మిగతా రాష్ట్రాల్లోలాగే రిజర్వేషన్ల 'పరిమితి' (50 శాతం) ప్రతిబంధకంగా ఉంది. సుప్రీంకోర్టు నిర్దేశించిన దానికన్నా ఇప్పటికే రెండు శాతం ఎక్కువ అంటే, 52 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయక్కడ. రెండోది, సామాజికంగా మరాఠాలు వెనుకబడిన వర్గం కాదని సంబంధిత కమిషన్లు చెప్పాయి. ఇది కూడా వారి కోటా డిమాండ్లకు అవరోధంగా మారింది.

మరాఠాలు వెనుకబడిన వర్గాల కేటగిరీ కిందకు రారని, వారు ఫార్వర్డ్ కులమని మండల కమిషన్ ఎప్పుడో స్పష్టం చేసింది. రాజకీయంగా కూడా ఎంతో ఎదిగిన మరాఠా కులాన్ని ఓబీసీ కేటగిరీలో చేర్చలేమని జాతీయ వెనుకబడిన వర్గాల కమిషన్ 2003లో స్పష్టం చేసింది. ఆ తర్వాత 2008లో మహారాష్ట్ర వెనుకబడిన వర్గాల కమిషన్ తన 22వ నివేదికలో కూడా మరాఠాలను ఓబీసీ కేటగిరీలో చేర్చలేమంటూ చేతులెత్తేసింది. ఆ నివేదికపై అసెంబ్లీలో చర్చ జరగాల్సి ఉండగానే మహారాష్ట్ర ప్రభుత్వం మరాఠాల రిజర్వేషన్ అంశంపై జస్టిస్ సరాఫ్ నాయకత్వాన ఓ కమిషన్ వేసింది. ఆ కమిషన్ మనుగడలో ఉండగానే మహారాష్ట్ర ప్రభుత్వం నారాయణ రాణె నాయకత్వాన మరో కమిషన్ వేసింది.

2014లో రాష్ట్ర ఎన్నికలకు కొంతకాలం ముందు నారాయణ రాణె కమిషన్ మరాఠాలకు రిజర్వేషన్ సిఫార్సు చేస్తూ నివేదిక సమర్పించింది. అప్పటి కాంగ్రెస్-ఎన్సీపీ ప్రభుత్వం ఆదరాబాదరాగా సమావేశమై మరాఠాలకు ప్రభుత్వ విద్య, ఉద్యోగావకాశాల్లో 16 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. ఆ మేరకు ఆర్డినెన్స్ కూడా జారీ చేసింది. దాన్ని నిలిపివేస్తూ అదే సంవత్సరం నవంబర్ నెలలో బోంబే హైకోర్టు స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ-శివసేన ప్రభుత్వం మరాఠాలకు 16 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టమే తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని కూడా హైకోర్టు అడ్డుకుంది.

### మరాఠాలు రిజర్వేషన్లకు అర్హులు కారని చెప్పటానికి కమిషన్లు, కోర్టులు చూపిన కారణాలు..

1960లో మహారాష్ట్ర ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని 18 మంది నిర్వహించగా, వారిలో పది మంది మరాఠాలే. 1962 నుంచి 2004 మధ్య 2,430 మంది శాసనసభ్యులు ఎన్నిక కాగా వారిలో సగానికన్నా ఎక్కువ అంటే 1,366 మంది మరాఠాలే ఎన్నికయ్యారు. జిల్లా సహకార బ్యాంకుల్లో, విద్యా సంస్థల్లో, వైద్య, ఇంజినీరింగ్ యూనివర్సిటీల్లో వారిదే పైచేయి. వారికే ఎక్కువ చక్కెర ఫ్యాక్టరీలు ఉన్నాయి. పాల సహకార సంఘాలపై వారిదే ఆధిపత్యం. వారి చేతుల్లోనే గణనీయంగా వ్యవసాయ భూములున్నాయి. ఒక విధంగా గ్రామీణ సామ్రాజ్యం వారిదే. అందుకే ప్రధానంగా వారి వృత్తి వ్యవసాయం అయింది. ఈ కారణాల వల్లనే వివిధ కమిషన్లు వారి డిమాండ్‌ను తిరస్కరిస్తూ రాగా, ఓట్ల రాజకీయాల కోసం నాడు దిగిపోతున్న కాంగ్రెస్-ఎన్సీపీ ప్రభుత్వం, నేటి బీజేపీ-శివసేన ప్రభుత్వం రిజర్వేషన్లను అనుమతించాయి.

మారుతున్న సామాజిక పరిస్థితుల కారణంగా మరాఠా యువకులు వ్యవసాయ రంగానికి దూరమవుతూ వచ్చారు. వారికి చదువు కొనుక్కునే స్తోమతు ఉన్నా, చదువులో పెద్దగా రాణించలేకపోయారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల వారు ముందుకు దూసుకెళుతుంటే తాము విద్యాసంస్థల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనుకబడిపోయామన్న భావం యువతలో పేరుకుపోయింది. అసహనం పెరిగిపోయింది. కేవలం రిజర్వేషన్ల కారణంగానే బీసీలు, ఓబీసీలు, దళితులు ముందుకు వెళుతున్నారన్న అక్కసు వారిలో పుట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో అహ్మద్‌నగర్ జిల్లా కోపర్డి నగర్‌లో 2016, సెప్టెంబర్ 20న 11 ఏళ్ల మరాఠా బాలికపై సామూహిక అత్యాచారం, హత్య జరిగింది. దోషులు దళితులు కావడంతో మరాఠాలు నాడు పెద్ద ఎత్తున ఉద్యమం చేశారు. నేరస్తులు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. సకాలంలోనే పోలీసులు దళితులను అరెస్టు చేయగా, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఆ కేసును త్వరితగతిన విచారించి ఏడాదిలోగానే ముగ్గురు దోషులకు మరణశిక్ష విధించింది. అయినా మరాఠాల కోపం చల్లారలేదు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టాన్ని రద్దు చేయాలంటూ ఆందోళనలు చేశారు. తమకు రిజర్వేషన్లు కావాలనే డిమాండ్‌ను మరింత ఉధృతం చేశారు. మరోవైపు, 350 కులాలున్న ఓబీసీ కేటగిరీలోకి బలమైన మరాఠాలను రానివ్వమని ఓబీసీలు అంటున్నారు.

తమిళనాడు నమూనాను పరిశీలిస్తే.. ఆ రాష్ట్రం 1980ల నుంచి 68-69శాతం రిజర్వేషన్లను అందిస్తోంది. అక్కడ బీసీలకు అత్యంత వెనకబడిన కులాలు వంటి వర్గీకరణతో 50శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. అయితే ఇందిరా

## అగ్రవర్ణ పేదలకూ రిజర్వేషన్‌ను పరిశీలించండి: మద్రాస్ హైకోర్టు

అగ్రవర్ణాల్లోని పేదలకూ రిజర్వేషన్లను తప్పనిసరిగా కల్పించాల్సిన అవసరం ఉందని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. ఆర్థిక స్థితి ఆధారంగా అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లను కల్పించే అవకాశాన్ని పరిశీలించాల్సిందిగా తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. 'అగ్రవర్ణాల పేదలు ఇప్పటి వరకు నిర్లక్ష్యానికి గురవుతూ వచ్చారు. సామాజిక న్యాయం పేరుతో నిరసన స్వరాలు వినిపిస్తాయేమోననే భయంతోనే వారి గురించి ఎవరూ మాట్లాడటం లేదు. సామాజిక న్యాయం అంటే సమాజంలో అన్ని వర్గాలకూ న్యాయం అందాలి" అని జస్టిస్ ఎన్.కిరుబకరన్ వ్యాఖ్యానించారు. 'రిజర్వేషన్లు కల్పించడం, లేదా అగ్రవర్ణాల్లోని పేదలను ఆదుకోవడమంటే ఇతర వర్గాలు అనుభవిస్తున్న రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నట్టు పరిగణించకూడదు. అన్ని కులాల్లోనూ పేదలు ఉన్నారని న్యాయస్థానానికి తెలుసు. అగ్రవర్ణంలోనైనా, వెనుకబడిన తరగతిలోనైనా పేదవాడు పేదవాడే. అన్ని విధాలా పైకి రావడానికి అలాంటివారికి రిజర్వేషన్లు కల్పించాలి' అన్నారు.

సాహ్ని వర్సెస్ భారత ప్రభుత్వం కేసులో రిజర్వేషన్లు 50శాతం పరిమితిలోనే ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టంచేయటం తో, రాష్ట్ర విద్యాసంస్థలు, సర్వీసులలో వెనకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలకు కోటాపై జయలలిత ప్రభుత్వం 1994లో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. 69 శాతం రిజర్వేషన్లను పరిరక్షించే ఈ తమిళనాడు యాక్ట్ ఆఫ్ 45ను తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి రాజ్యాంగంలోని ఆర్టికల్ 31-బి ద్వారా న్యాయసమీక్షకు అవకాశం లేకుండా చేయాలని కేంద్రాన్ని కోరింది. ఇందుకోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించి ఏకగ్రీవ తీర్మానం చేసింది. కేంద్రప్రభుత్వం 76వ రాజ్యాంగ సవరణ ద్వారా తమిళనాడు చట్టాన్ని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చింది. ఆ తర్వాత 2007లో వర్గీకరణ సవరణలు మినహా తమిళనాడులో 69శాతం కోటా కొనసాగుతూ వస్తోంది. అయితే తమిళనాడు చట్టాన్ని సవాలుచేస్తూ, క్రీమీలేయర్ అమలును కోరుతూ దాఖలైన ఓ పిటిషన్‌పై సుప్రీంకోర్టు మార్గనిర్దేశనం చేస్తూ, 50శాతం దాటి రిజర్వేషన్లు అవసరమని ఏ రాష్ట్రమైనా భావిస్తే అందుకు శాస్త్రీయ, గణాంక సహిత ఆధారాలను చూపాల్సిందేనని, తమిళనాడు కూడా ఇందుకు మినహాయింపు కాదని స్పష్టంచేసింది. తమిళనాడు లెక్కలపై ఆ రాష్ట్ర వెనకబడిన తరగతుల కమిషన్ అధ్యయనం చేసి ఏడాదిలోగా నివేదిక సమర్పించాలని జులై 13, 2010న ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. జస్టిస్ ఎంఎస్ జనార్థనం నేతృత్వంలోని కమిషన్ తమిళనాడులో బీసీల కోటాపై అధ్యయనం చేసి.. క్రీమీలేయర్ అవసరం లేకుండా రిజర్వేషన్ కోటా అర్థమైనరీతిలోనే ఉందని తేల్చింది. తమిళనాడు ప్రభుత్వం కమిషన్ నివేదికను ఆమోదించి క్రీమీలేయర్ తొలగించకుండా 69శాతం రిజర్వేషన్లను కొనసాగిస్తూ జులై 11, 2011న ఆదేశాలు జారీ చేసింది. అయితే తమిళనాడు చట్టంపై ఇంకా న్యాయవివాదాలు సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం వద్ద కొనసాగుతున్నాయి.

### ఏదోక రకంగా రిజర్వేషన్లు కల్పించినా మంటలు చల్లారవు

ఒకవేళ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు తమిళనాడు తరహాలో ఇక్కడ రిజర్వేషన్లు కల్పించినా ఆ సమస్య ఇంతటితో సమసిపోదు. న్యాయవివాదాల సంగతి అలా ఉంచితే.. శరవేగంగా పెరుగుతున్న నిరుద్యోగ యువత, అరకొర తాత్కాలిక ఆదాయాలు ఇతర కులాల నుంచి కూడా రిజర్వేషన్ డిమాండ్లను పెంచుతాయి. సమాజంలో సాంప్రదాయకంగా తక్కువ దృష్టితో చూసే, తక్కువ కులంవారు చేసే పనిగా భావించే రోడ్లు ఊడ్చే, శుభ్రం చేసే పనికి కాంట్రాక్టు ఉద్యోగుల కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తే లక్షల సంఖ్యలో పైకులాల వారు కూడా దరఖాస్తు చేశారు. ఇందులో గ్రాడ్యుయేట్లు, పీజీలు, కొందరు పీహెచ్‌డీలు వున్నారు. ఉన్న ఉద్యోగాలు మొత్తం 3,275. ఈమధ్య రైల్వే శాఖ అసిస్టెంట్ లోకోపైలెట్ (ఏఎల్‌పీ), గ్రూప్-డి పోస్టులకు ప్రకటనలు విడుదల చేస్తే, మొత్తం 90 వేలు కూడా లేని ఈ పోస్టులకు అక్షరాల 2,27,00,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితిని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఒక్కో పోస్టుకీ పోటీ వందలు, వేల సంఖ్యలోనే. దేశంలో ఇప్పుడు దాదాపు రెండుకోట్ల తక్షణ ఉపాధి అవకాశాల్ని సృష్టించాల్సి ఉంది.

మరోవైపు, శతాబ్దాల అమానుష వివక్షను తొలగించే క్రమంలో కొంత భరోసానివ్వటానికి రిజర్వేషన్లు కల్పించారన్న వాస్తవాన్ని విస్మరించి అగ్రకులాల్లోని అనేకమంది పేదలు అణగారిన కులాలవారిపై విద్వేషాన్ని పెంచుకుంటున్నారు.

రిజర్వేషన్ల కోసం మిగతా కులాల్లో పేదలు, అవకాశాలు అందనివారితోపాటు దళిత క్రైస్తవులు వంటి వారూ ముమ్మందు డిమాండ్లు ముమ్మరం చేస్తారు. కానీ ఒక పరిమితి దాటి రిజర్వేషన్లు సాధ్యం కాదు, ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లకు సమస్యలున్నాయి. రిజర్వేషన్ సమస్యను దాటవేయటమో, తాత్కాలిక రాజకీయ అవసరాలకోసం వినియోగించుకోవటమో చేయటం జాతికి తీరని ద్రోహమవుతుంది. ఉన్న కోటాలనే అటూఇటూ చేస్తూ కులాల మధ్య చిచ్చుపెట్టటం ఆపి రిజర్వేషన్ల విధానాన్ని సంస్కరించటం ఇప్పుడు ప్రజాపాలకులు చేయాల్సిన అతి ముఖ్యమైన పని.

## కాపు, ముస్లిం కోటా సహా రిజర్వేషన్ల సమస్యకు లోక్‌సత్తా 5 నిర్దిష్ట పరిష్కారాలు

ఈ నేపథ్యంలో లోక్‌సత్తా కాలపరీక్షకు నిలబడిన కొన్ని నిర్దిష్ట పరిష్కార ప్రతిపాదనల్ని చేస్తోంది. 50 శాతానికి మించకుండా ఇప్పుడున్న రిజర్వేషన్లను కొనసాగిస్తూనే వీటిని అమలు చేయాలి. ఇక్కడ నేపథ్యం కాపు, ముస్లింల రిజర్వేషన్లే అయినా.. మొత్తం దేశవ్యాప్తంగా కోటా సమస్యలకి ఇవి హేతుబద్ధ పరిష్కారాలు.

1) కాపులు, ముస్లింలలోని పేద పిల్లలకు ఎంపిక పోటీ పరీక్షల్లో అదనంగా మార్కులు కలపాలి. ఈ మార్కుల వెయిటేజీకి ఆ పిల్లలు చదివే స్కూలు స్థాయి, తల్లిదండ్రుల ఆర్థిక, విద్యాస్థాయి వంటివి పరిగణలోకి తీసుకోవచ్చు 2) కాపులు, ముస్లింల పిల్లలు ప్రభుత్వ/ప్రైవేటు/కార్పొరేట్ తేడా లేకుండా ఎవరు ఏ విద్యాసంస్థలో చదువుకున్నా ఉచితంగా విద్యనందించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి. ఏ స్థాయి ఉన్నత విద్యకైనా పూర్తి తోడ్పాటునందించాలి.

ఈ రెండు పరిష్కారసూత్రాల్నీ కాపులు, ముస్లింలతోపాటు అగ్రకులాలుగా పిలవబడుతున్న బ్రాహ్మణ, వైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ వంటి వాటిల్లో అవకాశాలు లేనివారికి కూడా వర్తింపచేస్తే భవిష్యత్తులో రిజర్వేషన్లను ఉపద్రవంగా భావించే పరిస్థితులు ఉండవు.

ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు, ఇతర నేతలు తాత్కాలిక రాజకీయాలను దాటి జాతి ప్రయోజనాల గురించి ఆలోచించే విజ్ఞతను ప్రదర్శించగలిగితే ఈ రిజర్వేషన్ల సంస్కరణలపై కాపులు, ముస్లింలలోని పెద్దలను ఒప్పించటం పెద్ద కష్టమేమీ కాదు. ఈ ప్రతిపాదనల్లో అవసరమైతే కొన్ని మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. కానీ ఒక ప్రత్యామ్నాయ పరిష్కారంతో కూడిన రిజర్వేషన్ల సంస్కరణల్ని అమలుచేయటం మాత్రం తెలుగు రాష్ట్రాలకు, ఈ దేశానికి ఇప్పుడు చాలా అవసరం. వీటికి రాజ్యాంగ సవరణలు వంటి సంక్లిష్ట ప్రక్రియలు కూడా అక్కర్లేదు. వీటితోపాటు రిజర్వేషన్ల కులాల్లో కూడా నిజమైన అర్హులకు అవకాశాలు అందేలాచేసేందుకు మరికొన్ని సంస్కరణలను చేపట్టాలి.

3) ఇప్పుడున్న రిజర్వేషన్లను యధాతథంగా కొనసాగిస్తూ క్రీమీ లేయర్‌ను అమలు చేసి కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సంపన్నుల పిల్లల్ని రిజర్వేషన్ పరిధి నుంచి తప్పించాలి. 4) కులం, మతం, డబ్బుతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి. 5) ప్రభుత్వోద్యోగులకు-సాధారణ ప్రజానీకానికి మధ్య అంతరాన్ని తగ్గించటం (2007-2016 మధ్య కాలంలో ప్రభుత్వోద్యోగాల మీద మోజు 62 నుంచి 65 శాతానికి పెరిగిందని సీఎస్‌డీఎస్ సర్వే తెలిపింది)తోపాటు.. ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు సేవలు సక్రమంగా అందుతాయని, కాస్త గౌరవప్రదమైన ప్రైవేటు ఉద్యోగం చేసినా సరైన ప్రభుత్వ సేవల వ్యవస్థల వల్ల తమ జీవన భద్రతకు ఢోకా ఉండదనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాలి. ఇందుకోసం 'పౌర సేవల' చట్టం వంటి ఏర్పాట్లు చేయాలి, గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గిస్తూ ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాల నాణ్యతను పెంచాలి.

లోక్‌సత్తా సూచించిన ఈ పరిష్కారాల్ని అమలు చేస్తే రిజర్వేషన్ల కులాల్లో అడుగున్న ఉన్న కోట్లాది అర్హులు అవకాశాల్ని అందుకోగలుగుతారు. క్రమంగా రిజర్వేషన్ల అవసరం లేకుండానే పేదరికం నుంచి బైటపడగలుగుతారు. రిజర్వేషన్ల బైట ఉన్నవారు లోపల ఉన్నవారిని ద్వేషభావంతో చూడకుండా తమకు కావలసిన అవకాశాల్ని పొందగలుగుతారు.

ఇంకో విషయం. రిజర్వేషన్లనేవి శతాబ్దాలపాటు భారతదేశంలో వివక్షకు గురైన కులాలకు మాత్రమే సంబంధించిందని, తరతరాల సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనాన్ని మాత్రమే రిజర్వేషన్ అర్హతగా గుర్తించాలని కొందరు వాదిస్తున్నారు. పేదరికాన్ని రిజర్వేషన్‌తో ముడిపెట్టకూడదంటున్నారు. ఇది కేవలం సాంకేతికపరమైన అభ్యంతరం.

రిజర్వేషన్ల పరిమితి దృష్ట్యా.. అగ్రవర్ణాల పేరుతోనో, మరో కారణం వల్లో రిజర్వేషన్ల బైట ఉన్న కులాల్లోని వారిని యధాతథంగా రిజర్వేషన్‌ల రూపంలో ఆదుకోవటం సాధ్యం

కాకపోవచ్చు. కానీ అదే తరహాలో ఏదోకరూపంలో అందులోని పేదలను ఆదుకోవటం మాత్రం తప్పనిసరి. అందరికీ నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల చుట్టూ తిప్పాల్సిన రాజకీయాన్ని.. పరిమిత రిజర్వేషన్ల చుట్టూ మాత్రమే తిప్పే ఓటుబ్యాంకు రాజకీయాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది.

కాబట్టి రిజర్వేషన్ ద్వారా క్రీమీలేయర్ స్థాయి లబ్ధి పొందిన వారిని కోటా నుంచి తొలగించటం, రిజర్వేషన్ల పరిధి 50 శాతానికి మించకూడదు కాబట్టి అందులో చోటివ్వకుండా ఆర్థిక వెనుకబాటుతనం ప్రాతిపదికన విద్యావకాశాల్ని కల్పించటం, పోటీ పరీక్షల్లో అదనపు మార్కులు కల్పించటం ప్రతిపాదనల్ని విమర్శించటం సహేతుకం కాదు. నాణ్యమైన చదువు, ఆర్థికంగా ఎదిగేందుకు రాయితీ అవకాశాలు.. వీటితో తప్ప వివక్ష మరింక ఎలా పోతుంది?

అధ్వాన్న చదువులు, పౌర సేవల్లేకుండా విస్తరిస్తున్న పట్టణీకరణ, ఉపాధి లేని ఆర్థిక వృద్ధి వల్లే ప్రధానంగా మన దేశం రిజర్వేషన్ల చుట్టూ కొట్టుకునే కులాల సమాజంగా ఇంకా కొనసాగుతోంది. లోక్‌సత్తా ప్రతిపాదించిన ఈ సంస్కరణలు రిజర్వేషన్ల చుట్టూ సంక్షోభాన్ని తొలగించటంతోపాటు అందరికీ ఎదిగే అవకాశాల్ని కల్పిస్తాయి. వీటిని లోతుగా చర్చించాకే, హేతుబద్ధ సూచనలేమైనా ఉంటే చేరుస్తూనే ఆమోదించవచ్చు. ఇవి చేయకుండా.. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించటం వంటి చిన్న చిన్న చర్యలతో అణగారిన వర్గాల్ని, ఇతర కులాల్లో పేదల్ని ఎల్లకాలం మభ్యపెట్టలేరు.

కాబట్టి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర నేతలు ఈ సంస్కరణలపై అందరినీ కలుపుకుని చర్చించి అమలు నిర్ణయం తీసుకుంటే రిజర్వేషన్లపై ఇచ్చిన తొందరపాటు హామీల్ని ఆచరణాత్మకంగా సరిదిద్దుకున్నట్టవుతుంది. రాజస్తాన్, గుజరాత్, హర్యానా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు, కేంద్ర ప్రభుత్వానికీ ఒక ఆదర్శప్రాయ నమూనాను అందించినట్టవుతుంది. రిజర్వేషన్ల సంస్కరణలపై దేశమంతటికీ తోవ చూపేందుకు తెలుగు రాష్ట్రాలకు ఇది ఒక గొప్ప అవకాశం.

2018-19 ఎన్నికల్లో ప్రాంతీయ, జాతీయ పార్టీల ఎజెండాను ఈ పరిష్కారాల దిశగా మార్చేందుకు తెలుగు నేల నుంచి ప్రతి ఒక్కరం మన వంతు ప్రయత్నం చేద్దాం.

విద్యాసంస్థల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు ఒక శాశ్వత పరిష్కారం లభిస్తే.. అన్ని వర్గాలకూ తగిన రాజకీయ ప్రాతినిధ్యం కోసం పార్టీల సీట్ల కేటాయింపులో మార్పులు, దామాషా ఎన్నికల పద్ధతి వంటి సంస్కరణలపైనా దృష్టి పెంచవచ్చు. ⁎

# ఉపాధి సంక్షోభ పరిష్కారానికి చొరవ చూపండి

## -నిరుద్యోగుల లేఖాస్త్రం-



రాష్ట్రంలో ఉపాధి అవకాశాల్ని పెంచే చర్యల్ని పెద్దఎత్తున చేపట్టాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేయాలని, ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు ఒత్తిడి తేవాలని లోక్‌సత్తా అనుబంధ యువసత్తా నేతలు విజయనగరంలో డిమాండ్ చేశారు. జిల్లాలో పలు పరిశ్రమలు మూతపడి ఉద్యోగులు వీధిన పడ్డారని, నిరుద్యోగ యువతకు అవకాశాలు లేకుండా పోయాయని యువసత్తా నియోజకవర్గ అధ్యక్షుడు రొక్కం గురునాథం అన్నారు. జిల్లా నలుమూల నుంచి విద్యార్థులు ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో సంవత్సరాల తరబడి శిక్షణ తీసుకుంటున్నారన్నారు. జిల్లాలోని నిరుద్యోగులతో యువసత్తా నేతలు సమావేశమయ్యారు. ఉపాధి సమస్యను పరిష్కరించాలంటూ నిరుద్యోగులు, విద్యార్థులతో అశోక్ గజపతికి లేఖలు రాయించారు. ఈ సందర్భంగా యువసత్తా కార్యదర్శి లంక లక్ష్మణరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఖాళీల్ని ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని, రుణసదుపాయాలను కల్పించి చిన్న పరిశ్రమలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువసత్తా ప్రతినిధులు శ్రీను, సూర్యా, కృష్ణా, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. ⁎

# ముస్లింల వెనకబాటుతనానికి సాంప్రదాయ పరిష్కారాల్నే సూచించిన సుధీర్ కమిటీ

తెలంగాణ రాష్ట్రంలో ముస్లింలు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడి ఉన్నారని సుధీర్ కమిషన్ పేర్కొంది. వీరి వెనకబాటుతనం ఎస్సీ, ఎస్టీలకన్నా కూడా ఎక్కువని తెలిపింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3.51 కోట్లు కాగా, ముస్లింలు 12.68శాతం (44.64లక్షలు) ఉన్నారని, కానీ అన్ని రంగాల్లో వారి స్థితిగతులు అట్టడుగున ఉన్నాయని పేర్కొంది. దాదాపు 40ఏళ్ల వెనకబాటుతనం వీరికి ఉన్నందున.. విద్య, ఉద్యోగాల్లో భాగస్వామ్యం పెంచేందుకు 9శాతానికి తగ్గకుండా 12శాతం వరకు రిజర్వేషన్లు కల్పించాలని పాలకుల మనసెరిగినట్టు సాంప్రదాయ పరిష్కారాన్నే సిఫార్సు చేసింది. రిజర్వేషన్ల పరిమితిని ఇది అతిక్రమించే అవకాశమున్నందున తమిళనాడు తరహాలో తగిన రాజ్యాంగ సవరణ కోసం కేంద్రాన్ని కోరాలని సూచించింది.

కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో జనాభా దామాషా పద్ధతి ప్రకారం ముస్లింలకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలని సంకల్పించిన తెరాస ప్రభుత్వం దీనికి సంబంధించి అధ్యయనం కోసం రిటైర్డ్ ఐఏఎస్ సుధీర్ అధ్యక్షతన ఓ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఎంఏ బారి, డాక్టర్ అమీరుల్లా ఖాన్, ప్రొఫెసర్ అబ్దుల్ షాబాన్‌లు సభ్యులుగా ఉన్న ఈ కమిటీ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలోని ముఖ్యాంశాలు..

### దశాబ్దాల వెనకబాటుతనం

నలభై ఏళ్ల కిందట సగటు స్థాయిలో ఉన్న ముస్లింలు ఇప్పుడు అందరికన్నా.. కొన్ని విషయాల్లో ఎస్సీ, ఎస్టీలకన్నా కూడా వెనకబడిపోయారు. నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) గణాంకాల ప్రకారం.. 1999లో సగటు పౌరులతో పోలిస్తే స్వల్పంగా దిగువన ఉన్న ఓబీసీలు ప్రస్తుతం అగ్రవర్ణాలతో సమానస్థాయిలో ఉన్నారు. అప్పట్లో ఓబీసీలకు



సమానంగా ఉన్న ముస్లింలు ఇప్పుడు చాలా వెనకబడిపోయారు. 1999-2011 మధ్య కాలంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల తలసరి ఆదాయవృద్ధితో పోలిస్తే ముస్లింల తలసరి ఆదాయవృద్ధి రేటు సగం మాత్రమే. 2004-12 మధ్య ముస్లింల తలసరి వ్యయం 60శాతం పెరగగా, హిందూ ఎస్టీల్లో 69శాతం, ఎస్సీల్లో 73శాతం, ఓబీసీల్లో 89శాతం, అగ్రవర్ణాల్లో 122శాతం పెరిగింది. దారిద్ర్యరేఖకు దిగువన హిందూ ఎస్సీలకన్నా ముస్లిం ఓబీసీల నిష్పత్తే ఎక్కువ.

### మధ్యలోనే చదువులకు స్వస్తి

ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండటంతో ముస్లింలు మధ్యలోనే చదువుకు స్వస్తి చెబుతున్నారు. పాఠశాల ముఖమే చూడని జనాభాలో అత్యధికంగా ఎస్టీలు, ముస్లింలే ఉండటం గమనార్హం. ఎస్టీల్లో 17శాతం, ముస్లింలలో 16శాతం అసలు విద్యాసంస్థల్లోనే చేరలేదు. ముస్లింల అక్షరాస్యత రేటు (70శాతం) ఓబీసీల్లో (74శాతం) కన్నా, సాధారణ హిందువుల (86శాతం) కన్నా తక్కువగా ఉందని 2014లో అమితాబ్ కుందు నేతృత్వంలోని సచార్ ఎవాల్యుయేషన్ కమిటీ బహిర్గతం చేసింది.

### పట్టభద్రుల స్థాయిలో మరీ తక్కువ

ముస్లింల అక్షరాస్యత రేటు తెలంగాణ సగటుకన్నా అధికంగా వున్నా, పట్టభద్రుల స్థాయికి వచ్చేసరికి స్వల్పంగా ఉంటోంది.

ఉస్మానియా వర్సిటీలో వీరి వాటా 10.85 శాతం ఉండగా, తెలంగాణ యూనివర్సిటీ లో 3.47శాతంగా ఉంది. ఇక మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మసీ, వెటర్నరీ వంటి కోర్సుల్లో ముస్లింల శాతం తక్కువగా ఉంది.

**జీవనప్రమాణాలు అధ్వాన్నం**

ముస్లింలు ఎక్కువగా దినసరి కూలీ మీద ఆధార పడుతున్నారు. 50 శాతానికి పైగా కుటుంబాల నెలసరి ఆదాయం రూ.10వేలు. ఎక్కువగా వలసలు వెళ్తున్నారు. బాలికల్లో రక్తహీనత అధికంగా ఉంది.

**సర్కారీ దవాఖానే దిక్కు**

పేదరికం కారణంగా చాలామంది ముస్లింలు వైద్యం కోసం సర్కారీ దవాఖానకే వెళ్తున్నారు. వైద్య సౌకర్యాలు సరిగా అందకపోవడం, మురికివాడల్లో నివాసం వల్ల చాలామంది ముస్లిం వయోజనుల ఆరోగ్యం సరైనస్థాయిలో లేదు. ఈ కారణాల వల్లే హిందువులు (62శాతం), క్రైస్తవులు (49.6శాతం)తో పోలిస్తే ముస్లిం గర్భవతుల్లో (66శాతం) రక్తహీనత అధికం. ఇతరులతో పోలిస్తే ముస్లిం పురుషులు ఎక్కువగా మధుమేహంతో బాధపడుతున్నారు. ముస్లిం పిల్లల ఆరోగ్య పరిస్థితి మాత్రం ఇతరుల కంటే మెరుగ్గా ఉంది. ముస్లింలలో మాతాశిశు మరణాల రేటు తక్కువే.

**ప్రభుత్వ ఉద్యోగుల్లో 7.36శాతమే**

రాష్ట్ర జనాభాల్లో 12శాతానికి పైగా ఉన్న ముస్లింలు ప్రభుత్వ ఉద్యోగాలలో మాత్రం 7.36శాతం మాత్రమే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సచివాలయం, జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో కలిపి మొత్తం 4,79,556 మంది ఉద్యోగులు ఉండగా.. అందులో ముస్లిం ఉద్యోగులు 35,279మంది. అఖిల భారత సర్వీసు ఉద్యోగులు 340మంది ఉండగా, అందులో ముస్లింలు 10మందే. వీరిలోనూ మహిళలకు ప్రాతినిధ్యం లేదు. ముస్లిం ఉద్యోగులలో 56.57శాతం నాలుగో తరగతి ఉద్యోగులుగానే ఉన్నారు.

**వ్యవసాయేతర పనులే జీవనాధారం**

హిందూ పురుషుల్లో 61శాతం సొంత కమతాల్లో ఉండగా, 38శాతం మంది వ్యవసాయరంగంలో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. ముస్లిం పురుషుల్లో 52శాతం మంది దినసరి కూలీలుగా, 48శాతం మంది స్వయంఉపాధి రంగంలో ఉన్నారు.

- పట్టణ తెలంగాణలో ముస్లింలు అధికంగా అద్దె ఇళ్లలోనే ఉంటున్నారు.
- కేవలం 31శాతం మందికే పక్కా ఇళ్లు ఉన్నాయి.
- గ్రామాల్లో నివసించేవారిలో అధికులకు ఇప్పటికీ మరుగుదొడ్డి సౌకర్యం లేదు.
- సమీపంలో కళాశాలలు, ప్రజారవాణా అందుబాటులో లేకపోవటంతో పదో తరగతిలో బాలికలు చదువు ఆపేస్తున్నారు.
- మహిళా కార్మికుల దినసరి కూలీ రూ.169కి మించటం లేదు.

**కీలక సిఫార్సులివీ..**

- ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో నియామకాలు, శిక్షణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్ని పర్యవేక్షించేందుకు సమాన అవకాశాల కమిటీని నియమించాలి.
- ముస్లింలలోని మెహ్తర్ లాంటి కొన్ని కులాల్ని ఎస్సీల్లో చేర్చి ఆ మేరకు రిజర్వేషన్ అవకాశాలివ్వాలి.
- ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి ఆయా పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ విభాగాల్లో ఖాళీగా పోస్టుల్లో ఉర్దూ ఉపాధ్యాయుల్ని నియమించాలి.
- ముస్లింల అభివృద్ధికి ప్రత్యేక ఉపప్రణాళిక రూపొందించాలి.
- విద్యార్థులకు నగదు రహిత ప్రవేశాల్ని కల్పించాలి.
- ఉగ్రవాదం, ఇతర నేరాల అనుమానంతో యువతను అరెస్టు చేయకుండా పోలీసులకు అవగాహన కల్పించాలి.
- తెలంగాణ మైనారిటీల ఫైనాన్స్ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి. ముస్లిం రిజర్వేషన్లలో మహిళలకు 33శాతం వాటా ఇవ్వాలి.

**తక్షణమే చేయాల్సినవి..**

- ఉర్దూ పాఠశాలలు తెరవాలి. మదర్సాలను సాధారణ

పాఠశాలలను గుర్తిస్తూ మదర్సా బోర్డును నియమించాలి. గుర్తింపు ఉన్న, లేని పాఠశాలలు, విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలి. ఎంఫిల్, పీహెచ్‌డీ ఉపకార వేతనాల సంఖ్యను పెంచి విద్యార్థినులకు ప్రత్యేక ప్రోత్సాహకాలివ్వాలి.

- ప్రయివేటు సంస్థలతో శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలి. కనీస వేతన చట్టాలు అమలు చేయాలి. ఐఏఎస్, ఐపీఎస్ లాంటి కేంద్ర సర్వీసుల్లో ప్రాధాన్యం పెంచేందుకు రాష్ట్ర స్థాయి పదోన్నతులు కల్పించాలి. ప్రత్యక్ష ఉద్యోగాల నియామక మండలిలో ఒక్కరైనా ముస్లిం సభ్యుడు ఉండాలి. ⌘

# సరైన విద్య, ఆరోగ్యం అందించలేని రాజకీయం ఎందుకు?



రాష్ట్రంలో విషజ్వరాలకు ప్రజలు అల్లాడిపోతున్నా, ఏజెన్సీ ప్రాంతాల్లో మరణిస్తున్నా ప్రభుత్వం చాలా యాంత్రికంగా స్పందిస్తోందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యవర్గ సభ్యుడు జి.వెంకటరమణబాబు అన్నారు. దేశవ్యాప్తంగా మన చదువులు అధ్వాన్నం అని నివేదికలు చెబుతుంటే, అందులో కూడా ఏపీ ఇంకా అధ్వాన్నంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి ఇంత చేశాం, అంత చేశాం అని చెప్పుకుంటున్న చంద్రబాబు ప్రభుత్వం.. విద్య, ఆరోగ్యంపై ఘోరవైఫల్యాలకు సమాధానం ఇవ్వాలన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం ఎందుకు అందటం లేదో అసెంబ్లీలో భారీ చర్చ చేయాలన్నారు. అనంతపురం జిల్లా కదిరి పట్టణంలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో పార్టీలకతీతంగా జరిగిన సురాజ్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో అనేక ప్రధాన సమస్యలు సంక్షోభాన్ని సృష్టిస్తున్నా, అధికార, ప్రతిపక్షాలు ఒకరి మీద ఒకరు బురద జల్లుకుంటూ కాలక్షేపం చేస్తున్నారన్నారు. లంచాల్లేకుండా ప్రభుత్వ కార్యాలయంలో పని చేసుకురాగలిగేవాళ్లకి ఏపీలో సన్మానాలు చేయొచ్చన్నారు. రాష్ట్రంలో పునాదుల్లేని పాలన సాగుతోందన్నారు. ఈ పరిస్థితిని మార్చటానికే సురాజ్య ఉద్యమాన్ని నిర్వహిస్తూ ప్రజలను, రాజకీయ వ్యవస్థను చైతన్య పరుస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయాన్ని తీసుకురావటానికి ప్రతిపాదనలతో వివిధ పార్టీలు ముందుకొస్తున్నాయన్నారు. లోక్‌సత్తా తన వంతు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షుడు బత్తినేని హరికృష్ణ, రామచంద్ర, వెంకటరమణాచారి, పుట్టపర్తి రమణ, కదిరి నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా రాజకీయ సంస్కరణలకు గట్టి మద్దతునిచ్చిన నయ్యర్

"స్వేచ్ఛ, రాజ్యాంగ బద్ధత కోసం తన జీవిత పర్యంతం పోరాడిన గొప్ప జర్నలిస్టు, కాలమిస్టు, పౌర మేధావి కులదీప్ నయ్యర్. రాజకీయ సంస్కరణల కోసం లోక్‌సత్తా చేసిన అనేక పోరాటాలకు.. రాజేంద్ర సచార్, కులదీప్ నయ్యర్ గట్టి మద్దతుని అందించారు. ఇద్దరూ ఇటీవల కొన్ని నెలల వ్యవధిలో మరణించారు. వారికి శాంతి కలిగించేలా వారి కృషిని కొనసాగించటమే మన ముందున్న కర్తవ్యం" అని కులదీప్ నయ్యర్‌కు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ నివాళులర్పించారు.

# ప్రభుత్వోద్యోగాల వైపు ఇంకా పెరిగిన ఆకర్షణ



దేశ యువతలో గత పదేళ్లకాలంలో (2007-2016) ప్రభుత్వ ఉద్యోగాల వైపు ఆకర్షణ పెరిగినట్టు ఓ అధ్యయనం వెల్లడించింది. లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ (సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ స్టడీస్) రెండు విడతలుగా జరిపిన దేశవ్యాప్త సర్వేలు ఇదే విషయాన్ని స్పష్టం చేశాయి.

సర్వేల్లో భాగంగా ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, హైదరబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, జైపూర్, సూరత్, పూణేలతో పాటు 11 రాష్ట్రాల్లో ఎక్కువ జనాభా ఉన్న మరికొన్ని నగరాలు, చిన్న పట్టణాలు, గ్రామాల్లోని 11,635 మంది యువతీయువకులను ప్రశ్నించి వారి అభిప్రాయాలను క్రోడీకరించారు. 2016 సర్వేలో పాల్గన్న యువజనుల్లో (15-34 వయోశ్రేణి) కనీసం 65 శాతం మంది ప్రభుత్వ ఉద్యోగాల వైపే మొగ్గు చూపారు. ప్రైవేటు రంగం వైపు చూస్తున్న యువత కేవలం 7 శాతమే. ఉద్యోగ స్థిరత్వం, ప్రభుత్వ-ప్రైవేటు రంగ ఉద్యోగుల మధ్య వేతనాల అంతరం తగ్గుతుండటం ఇందుకు ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. సౌకర్యాలు, సెలవలు వంటి అంశాలు కూడా యువతను కొంతమేర ప్రభావితం చేస్తున్నాయి. 2007లో 62 శాతం యువత సర్కారీ జాబులకు ఓటేశారు. 2007లో 13 శాతం మంది ప్రైవేటు ఉద్యోగాల వైపు మొగ్గు చూపగా 2016 నాటికి వారి సంఖ్య ఏడు శాతానికి పడిపోయింది.

**పెద్ద నగరాల యువత ప్రభుత్వ రంగం వైపే**

- సర్వేల ప్రకారం పెద్ద నగరాల్లో సర్కారీ కొలువుల వైపు మొగ్గు చూపుతున్న యువతీ యువకులు దశాబ్దకాలంలో బాగా పెరిగారు. 2007లో 48 శాతం మంది ప్రభుత్వోద్యోగాల వైపు మొగ్గు చూపారు. 2016-17 నాటికి ఇలాంటి యువజనులు మరో 14 శాతం పెరిగారు. ఈ నగరాల్లో ప్రైవేటు రంగాన్ని ఎంచుకుంటున్నవారు అప్పటి (24 శాతం) కంటే ఇప్పుడు బాగా తగ్గారు (10 శాతం).
- చిన్న నగరాల్లో సర్కారీ జాబులు కోరుకుంటున్న యువత దశాబ్ద కాలంలో 2 శాతం మేర పెరిగింది (2007లో 58 శాతం, 2016లో 60 శాతం).
- 2007లో 65 శాతం గ్రామీణ యువత ప్రభుత్వ ఉద్యోగాల వైపు మొగ్గు చూపగా 2016 నాటికి ఇలాంటివారు మరో నాలుగు శాతం మేరకు (69 శాతం) పెరిగారు.
- పెద్ద, చిన్న పట్టణాల్లో స్వయం ఉపాధి/వ్యాపారం పట్ల ఆసక్తి చూపుతున్న వారి సంఖ్యలో పెద్దగా మార్పు లేదు (ఇంచుమించు 20 శాతం).
- దేశవ్యాప్తంగా స్వయం ఉపాధి/వ్యాపారం పట్ల ఆసక్తి చూపుతున్నవారు 2007 (16 శాతం)తో పోల్చుకుంటే 2016 నాటికి కొద్దిగా పెరిగారు (19 శాతం).

**గ్రామాల్లో ప్రైవేటు మొగ్గు నామమాత్రం**

- గ్రామాల్లో డిగ్రీ, అంతకంటే ఎక్కువ చదువుకున్న యువతీయువకుల్లో అత్యధికులు (82 శాతం) ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రైవేటు రంగం వైపు చూస్తున్నవారు అతి స్వల్పం (4 శాతం). 12 శాతం మంది స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపుతున్నారు.
- విద్యాస్థాయితో నిమిత్తం లేకుండా పరిశీలించినప్పుడు 2007లో 9 శాతం గ్రామీణ యువత ప్రైవేటు రంగం వైపు మొగ్గింది. 2016లో ఇలాంటి వారి శాతం సున్నా.
- పేదవర్గాలు (63 శాతం), ఎగువ మధ్యతరగతి వర్గాలు (65 శాతం) కూడా సర్కారీ ఉద్యోగాలవైపు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రాధాన్యత ఇస్తున్న యువతలో దాదాపు సగం మంది స్థిరత్వాన్ని కారణంగా చూపుతున్నారు. కొందరు ఉద్యోగపరమైన సంతృప్తి, మంచి ఆదాయం, తమలా ఆలోచించే వాళ్లతో కలిసి పనిచేసే అవకాశం వంటివి కారణాలుగా చెబుతున్నారు. ⌘

# 'చిన్న ఉద్యోగం – పెద్ద ఉద్యోగం' మైండ్‌సెట్

రాజకీయాల్లోకి వస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత ఎస్.జైపాల్‌రెడ్డిని ఆయన పధ్నాలుగేళ్ల మనవడు అడిగాడట. 'త్యాగాలకు సిద్ధంగా ఉన్నావా?' అని జైపాల్ ఎదురు ప్రశ్నించారట. మనవడు ఏమాత్రం తడుము కోకుండా వెంటనే 'నో' అని చెప్పేశాడంట. 'రాజకీయాలంటే ఎంతో కొంత త్యాగం చేసే తత్వం ఉండాలి. నాకున్న త్యాగస్వభావం, నిబద్ధత మా పిల్లలకు, వారి పిల్లలకు ఉన్నాయని నేను భావించటం లేదు' అని జైపాల్ నిష్కర్షగా చెప్పారు.

ఓ ప్రముఖ తెలుగు ఛానల్ ఇంటర్వ్యూలో జైపాల్‌రెడ్డి తన మనవడి గురించి చెప్పిన మాటలు ఈవేళ మనలో అత్యధికులకు కూడా వర్తిస్తాయి. రాజకీయాలలోకి రాకపోయినా, మనలో ప్రతి ఒక్కరూ దేశం కోసం ఎంతో కొంత బాధ్యత తీసుకోవాలనే స్పృహ మన ఇళ్లల్లో కూడా కొరవడుతోంది. ప్రజాస్వామిక పాలన పట్ల అవగాహన ఉన్న విద్యార్థులు హైస్కూల్‌లో 17శాతం, కాలేజీల్లో 19శాతం మాత్రమే ఉన్నారని ఇటీవల ఓ సర్వేలో తేలింది. సరైన సొంత అభిప్రాయాలున్న విద్యార్థుల సంఖ్యయితే ఇక సరేసరి. యువతలో ఆదర్శభావాలు, దేశాభివృద్ధి పట్ల ఆకాంక్ష లేక కాదు. కానీ వాటిని నెరవేర్చుకునేందుకు కార్యాచరణ దిశగా వారిని నడిపించే సామాజిక పరిస్థితులు లోపిస్తున్నాయి. విద్యావ్యవస్థ, పెంపకం, ఆర్థికవ్యవస్థలో ప్రపంచస్థాయి పోటీ, కుల, మత భావజాలాలు, వినిమయ సంస్కృతి, రోల్‌మోడల్స్ తక్కువగా ఉండటం వంటివి యువతను తాత్కాలిక లక్ష్యాలు దాటనివ్వటం లేదు. అడ్డదారులు, ఎలా పనిచేసినా కొనసాగించే ప్రభుత్వోద్యోగాల కోసం వెతికేలా చేస్తున్నాయి.

ఈ ధోరణి.. వ్యక్తిగత జీవితానికి తక్షణం ఉపయోగపడే ఉద్యోగాల విషయంలో కూడా యువతను పక్కదోవ పట్టిస్తోంది. ఇప్పుడున్న విద్యావ్యవస్థలో నైపుణ్యాలు అందించే శక్తి లేదు. దానికితోడు పోటీ ప్రపంచం. దాంతో ఉద్యోగాలు అరకొరగా వస్తున్నాయి. వేగంగా ఉపాధి అందించే లక్ష్యంతో నైపుణ్యాల శిక్షణ అంటూ వేరే కార్యక్రమాన్ని మొదలుపెట్టినా, వివిధ కారణాల వల్ల అది వేగం పుంజుకోవటం లేదు. ఉన్న నైపుణ్యాలకు తగ్గట్టు యువతకు మంచి ఉద్యోగాలు ఇద్దామని కొన్ని ట్రస్టులు, సంస్థలు కూడా ప్రయత్నిస్తున్నా, యువతలో ఎక్కువమంది సద్వినియోగం చేసుకోవటం లేదు. జాబ్ మేళాలో పెద్దఎత్తున పాల్గొంటున్నా.. నచ్చిన జాబ్ ఇవ్వలేదని తిరస్కరించటం, ఒకవేళ జాబ్‌లో చేరినా ఒకట్రెండు నెలల్లో మానివేయటం చేస్తున్నారు. జాబ్ మేళాలకు ఇంటర్వ్యూలు జరిగేటప్పుడే ఎక్కువమంది



యూత్.. ఎన్ని గంటలు పనిచేయాలి? జీతం ఎంత? వంటి ప్రశ్నలే ఎక్కువగా అడుగుతున్నారని చెబుతున్నారు.

హైదరాబాద్‌లో నగరపాలక సంస్థ నిర్వహించిన ఓ జాబ్‌మేళా గురించి ఉన్నతాధికారులు మీడియాలో వాపోయారు. కొన్ని నెలల క్రితం నిర్వహించిన ఈ ఉద్యోగ మేళాలో 89 కంపెనీలు పాల్గొన్నాయి. రూ.7,500 నుంచి 22,000 వరకు జీతం ఆఫర్ చేశాయి. యువత పెద్దఎత్తున స్పందించింది. జీహెచ్ఎంసీ నలుమూలల్నుంచి 60,000మంది హాజరయ్యారు. వీరిలో బీటెక్, ఎంబీయే, పీజీల వంటి ఉన్నత చదువుల పట్టభద్రులు ఉన్నారు. 25 రకాల ఉద్యోగాలలో ఎంపిక చేశారు. అయితే ఉద్యోగాలకు ఎంపికయ్యాక అభ్యర్థులు పేచీ పెట్టారు. సంస్థలు ఇవ్వబోయిన ఉద్యోగాలు కాకుండా, తాము కోరుకున్న ఉద్యోగాన్నే ఇవ్వాలని పట్టుపట్టారు. దాంతో 60వేల దరఖాస్తులలో కేవలం 5,039 (11.9శాతం) మాత్రమే నియామకపత్రాలు అందుకున్నారు. వీరిలో కూడా కేవలం 12.8 శాతం మందే ఉద్యోగాల్లో చేరారు. ఆ చేరినవారిలో పలువురు ఒకట్రెండు నెలల్లోనే మానేశారు.

చిన్న ఉద్యోగం/వ్యాపారం – పెద్ద ఉద్యోగం/వ్యాపారం అని తేడా లేకుండా తాము నైపుణ్యంతో చేయగలిగిన ప్రతి పనినీ గౌరవంగా భావిస్తూ సొంత ఆదాయాన్ని సంపాదించుకోవటం, తమ జీవితాన్ని అడుగడుగునా ప్రభావితం చేసే రాజకీయాల్ని – పాలనను ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన ఎజెండా కలిగిన సరైన నేతలు ఎన్నికయ్యేలా చూడటం, ఏదోకమేర తమ వంతు నాయకత్వాన్ని అందించటం యువతీయువకులకజీవితంలో భాగం కాకపోతే.. అపారంగా ఉన్న మన యువశక్తి వృధా అయ్యే ప్రమాదముందని ఆలోచనాపరులు, బాధ్యతాయుత నేతలు, అధికారులు, పౌరులు హెచ్చరిస్తున్నారు. ఇందుకోసం యువతకు విద్యార్థి దశ నుంచి ఉపాధి, కులరహిత సమాజం, రాజకీయాలు – ఎన్నికలు – పాలన వంటి అంశాలపై సరైన అవగాహన పెంచాలని సూచిస్తున్నారు. ✶

# స్థితిమంతులకు రిజర్వేషన్లు వద్దు




అణగారిన వర్గాల్లో రిజర్వేషన్లతో లబ్ధి పొంది ఉన్నత హోదాలో ఉన్నవారికి, ఆర్థికంగా స్థిరపడినవారికి వాటిని ఎత్తివేయాల్సి ఉందని జేపీ అన్నారు. అదే సమయంలో రిజర్వేషన్ల పరిధిలోకి రాని కులాల్లో ఉన్నా సరే పేదరికం వల్ల అవకాశాలు అందుకోకుండా ఉన్నవారికి బోనస్ మార్కులు వంటి ప్రోత్సాహకాల్ని ప్రకటించాల్సుందన్నారు. అందరికీ నాణ్యమైన విద్యను అందించటం ద్వారానే అంతిమంగా రిజర్వేషన్లు, రాయితీలు అవసరంలేని వ్యవస్థను నిర్మించుకోగలమన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో ప్రకాశం జిల్లా కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో జయప్రకాష్ నారాయణ్ సమావేశమయ్యారు. సమాజంలోని రుగ్మతలపై, పాలనా వ్యవస్థ వైఫల్యంపై విద్యార్థినీ విద్యార్థులను హత్తుకునేలా ప్రసంగించిన అనంతరం.. ముఖాముఖి ప్రశ్నలతో ఆలోచనలను రేకెత్తిస్తూ పరిష్కారాల దిశగా విద్యార్థులను జేపీ కార్యోన్ముఖుల్ని చేశారు.

విద్యార్థుల్లో ఆలోచన రేకెత్తిస్తూ సమస్యలను పరిష్కారం చూపటమే విద్య పరమార్థమని, అటువంటి విద్యను అందించే బాధ్యతలో ప్రభుత్వాలు విఫలమవటమే ఇప్పుడు దేశంలోని చాలా సమస్యలకు మూలకారణమని జేపీ అన్నారు. ఆర్థిక అసమానతలు, కుల వివక్ష కొనసాగింపు, ఉపాధిలేమి ఇవన్నీ కూడా అధ్వాన్న విద్యావ్యవస్థవైపే వేలెత్తి చూపుతున్నాయన్నారు. రోజుకు రూ.11వేల కోట్లను ప్రభుత్వాలు ప్రజల పేరు మీద ఖర్చు చేస్తున్నా.. జనం ఎదుగుదలకు కావలసిన విద్య మాత్రం అందటం లేదన్నారు. విద్య కోసం, వైద్యం కోసం ఆస్తుల్ని తెగనమ్ముకుని కోట్ల మంది పేదలుగా మారుతున్న దేశం ప్రపంచంలో భారత్ తప్ప మరొకటి లేదన్నారు. దేశానికి ఎంత గర్వించదగ్గ చరిత్ర, సంస్కృతి ఉన్నా.. అంతకంటే అవమానకరమైన పరిస్థితుల్ని మన విద్య, ఆరోగ్య రంగాలు కల్పిస్తున్నాయన్నారు. నియంతృత్వ దేశమైన చైనా కూడా మనకంటే ఈ కనీస ప్రజావసరాల విషయంలో అనేక యోజనాలు ముందుందన్నారు. చేసే ఖర్చును అసంబద్ధంగా చేయటం, అందులోనూ భారీ అవినీతి.. భారతదేశ ఎదుగుదలకు శాపంగా మారాయన్నారు. దేశంలో అత్యధిక సంఖ్యాకులు ఆధారపడిన వ్యవసాయంలో ఆదాయాన్ని ప్రభుత్వమే అణగదొక్కుతోందని, దీంతో పేదరికం నుంచి నినాదాల్లో తప్ప వాస్తవంలో ప్రజలు బైటపడలేకపోతున్నారన్నారు. పల్లెలకు, పట్టణాలకు అంతరం పెరిగిపోతూ సామాజిక అస్థిరత దిశగా దేశం పయనిస్తోందన్నారు. చట్టబద్ధ పాలనను అమలు చేస్తూ, అందరికీ నాణ్యమైన విద్య, వైద్యాలను అందుబాటులోకి తీసుకొస్తే చాలా వరకూ దేశం స్వావలంబన సాధిస్తుందని, ఇందుకోసమే సురాజ్య యాత్రని అన్నారు.

పదేళ్ల పాటు రిజర్వేషన్లను ఇస్తే ఈలోగా అందరికీ సమానావకాశాలను ఇచ్చేందుకు నాణ్యమైన విద్య చుట్టూ వ్యవస్థ నిర్మాణమవుతుందని డా॥ అంబేద్కర్ భావించారని, అయితే పాలకులు అసమానతల్ని తొలగించకుండా వాటిని తమ కుటిల రాజకీయం కోసం పెంచిపోషించటం మొదలుపెట్టారని జేపీ అన్నారు. కులాల మధ్య తంపులు తెచ్చి రిజర్వేషన్లను రాజకీయ ట్రంపు కార్డుగా వాడుకుంటున్నారన్నారు. రాజస్థాన్‌లో గుజ్జర్లు-మీనాలు, గుజరాత్‌లో పటేళ్లు, హర్యానాలో జాట్లు, ఆంధ్రప్రదేశ్‌లో కాపులు.. ఇలా రిజర్వేషన్ల అంశం రాజకీయ మనుగడ కోసం తురుపుముక్కగా మారిందన్నారు. రిజర్వేషన్ల ద్వారా లబ్ధి పొందినవారు ప్రతిభతో పోటీపడటానికి బదులు, ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లను అడగటం సరికాదని, దీనివల్ల ఆయా కులాల్లోని అణగారిన వర్గాలకు అవకాశాలు అందవని, అయితే ఇలాంటి ధోరణుల్ని కూడా పార్టీలు రెచ్చగొడుతున్నాయని అన్నారు. రిజర్వేషన్లపై వాస్తవికంగా చర్చించాల్సుందన్నారు. సమాజానికి పనికొచ్చేదిగా, 90శాతం మంది అంగీకరించేదిగా వాస్తవిక పరిష్కారం రూపుదిద్దుకోవాలన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా వెబ్ ప్లాట్‌ఫాంలో నమోదు కావడం ద్వారా వ్యక్తిగతంగా, సమాజపరంగా పరిష్కారాల్లో భాగస్వాములవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, కోశాధికారి కంచర్ల శ్రీకాంత్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపల్ వి.హరిబాబు, లోక్‌సత్తా నాయకులు రామ్మోహనరావు, డాక్టర్ రాధాదేవి, శివరమేష్‌రెడ్డి, మహ్మద్‌రఫీ, వైబీఐ కన్వీనర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ✦


# 'పౌర సేవల' చట్టం తేకుండానే ఎన్నికలకా?

- డా॥ పి.భాస్కరరావు

ప్రజాస్వామ్యమంటే ఎన్నికలు మాత్రమే కాదు.. ఎన్నికల మధ్య ఏం జరుగుతుందనేది కూడా. అసలు ఎన్నికల లక్ష్యమే.. ఎన్నికల మధ్యకాలంలో సరైన పాలనను అందించటం! అందుకే గత నాలుగేళ్లలో లోక్‌సత్తా వివిధ సందర్భాలలో కొన్ని కీలక సంస్కరణల్ని తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. ప్రతిస్పందనల్లో భాగంగా కూడా వీటిని గుర్తుచేసేందుకు ప్రయత్నించింది. ఇందులో.. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, గ్రామపంచాయతీలకు, హైదరాబాద్ సహా పట్టణ వార్డులకు తలసరి కేటాయింపుతో స్థానిక ప్రభుత్వాల సాధికారత, రైతులకు న్యాయమైన ధర అందించేందుకు ధరల స్థిరీకరణ నిధి, మహిళలపై అత్యాచారాల నిరోధానికి స్థానిక న్యాయస్థానాల ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా హక్కుగా సేవలందించేందుకు 'పౌర సేవల' చట్టం వంటి అంశాలున్నాయి.

ప్రస్తుతానికి మాత్రం 'పౌర సేవల' (రైట్ టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ–ఆర్‌టీఎస్) చట్టానికి సంబంధించి కొన్ని అంశాలు.

ప్రభుత్వాన్ని గుడ్డిగా వ్యతిరేకించటమో, సమర్థించటమో లోక్‌సత్తా పద్ధతి కాదు. తెలంగాణ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పౌర సేవల చట్టాన్ని తేవాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఆలోచిస్తున్నట్టు మీడియాలో చూసిన వెంటనే ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అక్టోబర్ 19, 2016న ఆయనకు లేఖ రాశారు. మంచి పనికి ఆలస్యం చేయకూడదు గదా! ఈ చట్టం కోసం 1998లో 'స్వరాజ్యం' పేరుతో పౌరహక్కుల పత్రాల (సిటిజన్ ఛార్టర్లు)ను ప్రచురించటం దగ్గర్నుంచీ లోక్‌సత్తా కృషి చేస్తోంది. 2012లో పార్లమెంటరీ కమిటీ విజ్ఞప్తి మేరకు జేపీ జాతీయ స్థాయి పౌర సేవల బిల్లును రూపొందించి అందచేశారు. ఈ నేపథ్యాన్ని లేఖగా వివరిస్తూ, లోక్‌సత్తా రూపొందించిన బిల్లును జతచేసి జేపీ కేసీఆర్‌కు పంపారు.




**బిల్లుపై ప్రజాచైతన్యం పెంచే కార్యక్రమాలు**

లోక్‌సత్తా కృషితో 2001లోనే సిటిజన్ ఛార్టర్లని పైలెట్ ప్రాజెక్టుగా తెలుగునాట కుత్బుల్లాపూర్, తణుకు, గుంటూరు మునిసిపాలిటీల్లో అమలుచేశారు. ప్రభుత్వ ఉదాసీనతకు తోడు ప్రజల్లో అవగాహన తగినంతగా లేకపోవటం వల్ల కూడా సిటిజన్ ఛార్టర్లు ఆశించిన ఫలితం ఇవ్వకుండా మొక్కుబడిగా మారాయి. ఇప్పటికీ అదే తంతు నడుస్తోంది. పేరుకే తప్ప సర్కారీ కార్యాలయాల్లో ఛార్టర్లు అమలవవు. ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలు ప్రభుత్వ కార్యాలయంలో సర్టిఫికెట్ కోసమో, నల్లా కనెక్షన్ కోసమో, మరో పని కోసం వెళ్లాలంటేనే భయపడుతూ ఆత్మన్యూనతకు లోనవుతున్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలంటే అనేకమందికి వణుకొస్తుంది. ఈసేవ, మీసేవ, ఇతర ఎలక్ట్రానిక్ సేవలు వచ్చి కొంత పారదర్శకత పెరిగినా, అవినీతి, వేధింపులను ఆపటానికి అవి సరిపోవటం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో పలురకాల పనులు చేయించుకోవటం కోసం కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, పలుకుబడి గలవారి సాయాన్ని ప్రజలు తీసుకుంటూనే ఉన్నారు. ప్రజాప్రతినిధుల్లో పలువురికి ఇలా రోజువారీ ప్రజల పనులు ప్రభుత్వ కార్యాలయాల్లో చేసి పెట్టటానికే నెలకు లక్షలు ఖర్చవుతున్నాయి. చివరికి తమకు సంబంధం లేని ఈ పనులు చేయటమే ఓట్లు సంపాదించటానికి మార్గంగా పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నేతలు భావిస్తున్నారు. పార్టీలు, నేతలు ఇంత డబ్బును అనధికారికంగా ఖర్చు చేస్తున్నా ప్రజలకు లంచాల బెడద, అధ్వాన్న సేవలు తప్పటం లేదు. ఈ నేపథ్యాన్నంతటినీ వివరిస్తూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేని నాణ్యమైన సేవలందించటంలో కీలకమైన 'పౌర సేవల చట్టం'పై ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలను లోక్‌సత్తా చేపట్టింది. చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని వివిధ మార్గాల్లో కోరుతూనే ఈ కార్యక్రమాల్ని లోక్‌సత్తా నిర్వహించింది.

పౌర సేవల చట్టం కోసం పలు సమావేశాలను నిర్వహించి ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేయటంతోపాటు.. ముఖ్యమంత్రికి నేరుగా పోస్టుకార్డుల్ని కూడా రాశాం, రాయించాం. కాంగ్రెస్, తెలుగుదేశం, సీపీఐ, సీపీఎం, తెలంగాణ జన సమితి తదితర పార్టీలన్నిటినీ కలిసి పౌర సేవల చట్టం సాకారమవటానికి మద్దతివ్వమని కోరాం. అన్ని పార్టీలూ మద్దతు ప్రకటించాయి. బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడితే సంపూర్ణ మద్దతిస్తామని సీపీఐ నుంచి చాడ వెంకటరెడ్డిగారు, కాంగ్రెస్ నేత జానారెడ్డి గారు ముఖ్యమంత్రికి లేఖలు కూడా రాశారు.

కానీ ఈ కీలక శాసనంపై కేసీఆర్ ప్రభుత్వం త్వరితగతిన స్పందించలేకపోయింది. పౌర సేవల బిల్లు రూపకల్పనలో తెలంగాణ ప్రభుత్వం నల్సార్ తోడ్పాటు తీసుకున్నట్టు మీడియాలో చదివాం. బిల్లుపై అవగాహన, ముందుచూపు ఉన్న వారందరి అభిప్రాయాలనూ పరిగణలోకి తీసుకోవటం అవసరమనటంలో సందేహం లేదు. అందుకే లోక్‌సత్తా ఈ చట్టంపై పలుమార్లు రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహించి అభిప్రాయాలను సేకరించింది. వాటిని కూడా కలిపి బిల్లును మెరుగుపరిచింది. ప్రభుత్వం బిల్లును రూపొందించాక కూడా దానిపై అవగాహన ఉన్నవారితో ఒక సమావేశం ఏర్పాటు చేయటం మేలని సూచించింది. ప్రతి ప్రభుత్వ కార్యాలయం తాను అందించే సేవలతో సిటిజన్ ఛార్టర్లను ప్రచురించి కార్యాలయం ముందు బోర్డు పెట్టటం, అందులో ప్రతి పనికీ నిర్ణీత గడువు ఉండటం, ఆ గడువులోగా పని పూర్తి చేయలేకపోతే రోజుకు కనీసం రూ.250 దరఖాస్తు చేసుకున్న ప్రజలకు చెల్లించటం, ఎలక్ట్రానిక్ సేవలను కూడా కలపటం.. చట్టంలో తప్పనిసరిగా పొందుపరచాల్సిన అంశాలుగా ప్రభుత్వం గుర్తించాలని లోక్‌సత్తా కోరింది.

ఈ రకమైన ప్రభావశీల పౌర సేవల చట్టాన్ని తీసుకొస్తే.. పైన అనుకున్న కారణాల వల్ల ఎమ్మెల్యేలకు సైతం రిలీఫ్ కలిగి ఒకమేరకు ఎన్నికల సంస్కరణ కూడా జరుగుతుంది. ఎన్నికల ఖర్చు తగ్గి మెరుగైన యువత రాజకీయాల్లోకి రాగలుగుతారు.

అన్ని ప్రభుత్వ సేవలకూ నిర్ణీత గడువును నిర్ణయించటం ఇప్పటికిప్పుడు సాధ్యం కాదనుకుంటే కనీసం కొన్ని సేవలతో పౌర సేవల చట్టాన్ని ప్రారంభించవచ్చు. దీన్ని వ్యక్తిగతంగా తీసుకోకుండా.. ఒక మెరుగైన వ్యవస్థ నిర్మాణం కోసం జరుగుతున్న ప్రయత్నంగా భావించి ప్రభుత్వానికి తమ వంతు సహకారాన్ని అందించాలని ప్రజాసేవకులైన ప్రభుత్వోద్యోగులను కూడా లోక్‌సత్తా కోరింది. వ్యక్తిగత నిజాయతీ అనే కనీస లక్షణం మనలో చాలామందికి ఉంది. కానీ ఇప్పుడు తెలంగాణకు, ఈ దేశానికి కావలసింది– వ్యవస్థీకృత నిజాయతీ! వ్యవస్థ సక్రమంగా ఉంటేనే.. జనాభాలో అత్యధికంగా ఉన్న పేద, అణగారినవర్గాలకు న్యాయం జరుగుతుంది.

మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కూడా జేపీ 'పౌర సేవల' చట్టం నమూనాను పంపారు.

తెలంగాణ తరహాలోనే.. వ్యాపార కలాపాలు చేసేవారికి చకచకా పనులు జరగటం కోసం 'ఏపీ బిజినెస్ యాక్షన్ సంస్కరణ ప్రణాళిక, 2017'లో భాగంగా ప్రధాన సేవలలో పబ్లిక్ సర్వీస్ డెలివరీ గ్యారంటీ (పీఎస్‌డీ) చట్టాన్ని చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చింది. అయితే పౌర సేవల చట్టం కేవలం పారిశ్రామికవేత్తలకే కాకుండా.. అన్ని ప్రభుత్వ విభాగాలకు, ప్రజలందరికీ వర్తించేలా రెండు రాష్ట్రాలూ విస్తరించాల్సుంది. ఈ విషయాన్ని లోక్‌సత్తా రెండు రాష్ట్రాల పాలకుల దృష్టికీ తీసుకెళ్లింది.

కానీ ప్రభుత్వాలు ఆలస్యం చేశాయి. తెలంగాణలో ముందస్తు ఎన్నికల హడావుడి మొదలైపోయింది. ప్రజలకు ఎన్ని చేసినా.. ప్రజలు తలెత్తుకుని ధీమాగా ప్రభుత్వ కార్యాలయాల్లోకి వెళ్లి లంచాలు, వేధింపులు లేకుండా హక్కుగా తమకు రావాల్సిన సేవల్ని పొందే ఏర్పాటును చేయకపోవటం మాత్రం పెద్ద లోటే అనటంలో సందేహం లేదు. ఈ లోటుతోనే తెలంగాణ తొలి శాసనసభ ముగిసి ఎన్నికలకు వెళ్లటం బాధాకరం. తెలంగాణ మొట్టమొదటి శాసనసభ హయాంలోనే ప్రజలందరికీ వర్తించే పౌర సేవల చట్టం వచ్చి ఉంటే ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ మద్దతిస్తున్నా బిల్లును ప్రవేశపెట్టకపోవటం బాధ్యతారాహిత్యం.

ఆపద్ధర్మ/కేర్ టేకర్ ముఖ్యమంత్రి అని రాజ్యాంగంలో ప్రత్యేకంగా నిర్వచనం లేకపోయినా, అటువంటి ముఖ్యమంత్రి ఆర్డినెన్సుల ద్వారా చట్టాల్ని చేయటం సరికాదనే అభిప్రాయం ఉంది. 'పౌర సేవల' చట్టానికి అన్ని పార్టీలూ మద్దతిస్తున్నాయి కాబట్టి.. ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఏదోకరూపంలో చట్టానికి పునాదులు వేయటానికి, నష్టాన్ని కొంతయినా తగ్గించటానికి ప్రయత్నించండి కేసీఆర్ గారూ! ఈ చట్టాన్ని ముందే తేకుండా ముందస్తు ఎన్నికలకు వెళ్తున్నందుకు మాత్రం మీరు ప్రజలకు జవాబు చెప్పాల్సి ఉంటుంది. రానున్న ఎన్నికల్లో 'పౌర సేవల' చట్టాన్ని ఓ ప్రధానాంశంగా తీసుకెళ్లి ప్రజల డిమాండ్‌గా మార్చటానికి, ఓటింగ్‌ను ప్రభావితం చేయటానికి లోక్‌సత్తా తన శాయశక్తులా ప్రయత్నిస్తుంది. సమాచార హక్కు చట్టం కన్నా విప్లవాత్మకమైన పౌర సేవల చట్టం తెలుగు రాష్ట్రాల నవపరిపాలన ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలుస్తుందనటంలో సందేహం లేదు. ✶

# అవినీతి నిరోధక చట్టంలో సవరణలు ఎవరికి లాభం?

- రావులపాటి సీతారాంరావు

అధికారిగా నేను అవినీతి నిరోధక శాఖకు డిప్యుటేషన్ మీద వెళ్లి జాయిన్ అయిన మొదటి రోజున అప్పటి డైరెక్టర్ 'సమాజంలోని అవినీతినంతా తీసేసి సమాజాన్ని బాగు చేసే పని మనది కాదు. ఆ పని ప్రభుత్వం చూసుకుంటుంది. అవినీతి అధికారులు మన దృష్టికి వచ్చినప్పుడు వాళ్లను పట్టుకోవటమే గాకుండా, కోర్టుల్లో వాళ్లకు శిక్ష పడేంతవరకూ కృషి చేయడమే మన పనీ, బాధ్యతా, కర్తవ్యమూ!" అని చెప్పారు.



మూడు సార్లు అవినీతి నిరోధక శాఖలో ఉద్యోగం చేసిన సందర్భాల్లో ప్రతి రోజూ ఆ మాట జ్ఞాపకం వచ్చేది. అవినీతి నిరోధక చట్టం 1988 కొన్ని సవరణలకు లోనయి ఆ మధ్యనే చట్టంగా రూపుదిద్దుకున్నది. ఆ సవరణలు నిజంగానే అవినీతి నిరోధానికి సహకరిస్తాయా లేదా అన్నదే ప్రస్తుతం అన్ని చోట్లా చర్చగా మారింది. సీబీఐ అధికారులతో సహా చాలామంది న్యాయవాదులూ, మేధావులు ఈ కొత్త సవరణను తప్పు పట్టటమే గాకుండా, పాత చట్టాన్ని నీరు గార్చటమే ధ్యేయంగా ఈ సవరణలను రూపొందించారని విమర్శిస్తున్నారు. విమర్శలు ఎంతవరకు సమంజసమో కాలమే నిర్ణయిస్తుంది. కానీ చట్టంలో రూపుదిద్దుకున్న ఈ సవరణలను అధ్యయనం చేయటమే గాకుండా, అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వోద్యోగులను ఎంతవరకు ఈ కొత్త చట్టం నియంత్రించగలుగుతుందో చూడాల్సిన బాధ్యత అందరి మీదా ఉంది. ఉద్యోగుల అవినీతి పెచ్చురిల్లిపోతున్నదని, దేశంలో ఇది మహమ్మారిగా వ్యాపించిందని అందరం ఘోషిస్తున్న వేళ ఈ సవరణలను గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత కచ్చితంగా ఉంది.

పి.సి యాక్ట్‌లో కొన్ని సవరణలు చేయటానికి 2013 సంవత్సరంలోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టింది. కానీ బిల్లు రూపంలో పార్లమెంటు ముందుకు తీసుకొచ్చి పాస్ చేయించలేకపోయింది. 2015లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలను కొన్నిటిని సవరించి, ఎన్డీయే ప్రభుత్వం బిల్లు రూపంలో ముందుకు తీసుకొని వచ్చింది. ఆ నాలుగు సవరణలను రాజ్యసభ, లా కమిషన్ ఆమోదించాయి. ఆ విధంగా 158 సంవత్సరాలు (1860లో ఐపిసి అమలులోకి వచ్చింది) చరిత్రలో పాతుకొనిపోయిన లీగల్ ప్రిన్సిపుల్స్‌ను, చట్ట పరిభాషను మార్చి ఈ చట్ట సవరణలను తీసుకొని వచ్చింది. ఏ విధంగా ఈ చట్టం కోర్టుల్లో నిలుస్తుందో, అవినీతి నియంత్రణకు సహకరిస్తుందో కాలమే నిర్ణయించాలి.

పి.సి యాక్ట్ 1988లో తీసుకొచ్చిన మార్పులు ఏమిటంటే 1) 7, 8, 9, 10 సెక్షన్లను (1988 పి.సి యాక్ట్‌లో ఉన్నవి) తొలగించి కొత్త పదాలతో, నిర్వచనాలతో పూరించారు. ఈ సెక్షన్లలో అంతకు మునుపు ఏమీ సందిగ్ధత లేదు. కానీ అందరికీ అర్థమయ్యే రీతిలో రూపొందించబడిన చట్ట పరిభాషను మార్చటం వల్ల అనుమానాలకు ఆస్కారం ఏర్పడింది. జ్యుడీషియరీ ఈ కొత్త సవరణలను సరియైన రీతిలో ఇంటర్‌ప్రెట్ చేయటానికి చాలా సమయం పట్టే అవకాశం ఉందని, అనుభవజ్ఞుల వాదన. 2) సెక్షన్ 13 (1) (డి)లో ఉన్న ఒక ముఖ్యమైన అంశాన్ని తొలగించటం జరిగింది. అంతకు మునుపు ఈ అంశాన్ని ఆధారం చేసుకొని సీనియర్ అధికారులు, మినిస్టర్లు లంచం తీసుకొన్నప్పుడు, ప్రత్యక్షంగా పట్టుకొనే అవకాశాలు చాలా తక్కువ ఉన్న పరిస్థితుల్లో గూడా అవినీతి కేసులు పెట్టగలిగేవారు. కొత్తగా రూపొందించబడ్డ చట్టంలో సెక్షన్ 7 ద్వారా ఈ అంశాన్ని (పూర్తిగా కాదు) తీసుకొని రావటం జరిగిందని అంటున్నారు కానీ, ఈ సెక్షన్‌లోని వివరణ ఆ చర్యను మరింత జటిలం చేసే పరిస్థితులు కల్పించింది. అంతే కాదు, ఈ కొత్త సవరణ ద్వారా శిక్షా కాలాన్ని పదేళ్ల నుంచి ఏడేళ్లకు కుదించటం జరిగింది. ఈ మార్పు ఎవరికి ఉపయోగపడుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 3) అవినీతి కేసులు ప్రభుత్వంలోని అధికారుల మీద నమోదు చేసేందుకు ఇంతకు పూర్వం ప్రభుత్వాల ముందస్తు అనుమతి తప్పనిసరి అనే నిబంధనను 2014 సంవత్సరంలో సుప్రీంకోర్టు తొలగించింది. దాంతో సీబీఐ కానీ, అవినీతి నిరోధక శాఖ కానీ సీనియర్ అధికారుల అవినీతిని కేసుల ద్వారా వెలికి తెచ్చే వెసులుబాటును పూర్తిగా వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. స్వతంత్రంగా ఈ సంస్థలు పని చేస్తూ ఉన్నతస్థాయిలో వున్న సీనియర్ అవినీతి అధికారుల గుండెల్లో

రైళ్లు పరుగెత్తించాయి. కానీ చట్టంలో ప్రస్తుతం తెచ్చిన ఒక సవరణ వల్ల ప్రభుత్వ అధికారులు ఏ స్థాయిలో ఉన్నా వారి మీద కొన్ని రకాల అవినీతి కేసులు నమోదు చేయాలంటే ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనిసరి. అన్ని కేటగిరీల్లోని అధికారులకు ఇది వర్తిస్తుంది కాబట్టి, అవినీతికి పాల్పడుతున్న అధికారులు ఊపిరి పీల్చుకునే అవకాశం ఏర్పడింది. నియంత్రణ సంస్థలకు సుప్రీంకోర్టు అందించిన కొద్దిపాటి వెసులుబాటు అందుబాటులో ఉండదు.

నిజానికి అవినీతి అధికారులపై కేసులను కోర్టుల్లో ప్రాసిక్యూట్ చేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. దీనికి తోడు కేసులు పెట్టాలన్నా ముందస్తు అనుమతి తప్పనిసరి అనటంతో నియంత్రణ సంస్థల చేతులు కట్టి పడేసినట్లయింది. అంతే గాదు రిటైర్ అయిన ఉద్యోగులను అవినీతి కేసుల్లో ప్రాసిక్యూట్ చేయాలన్నా ప్రభుత్వ అనుమతి అవసరమనే అంశం ఈ కొత్త సవరణల్లో చోటు చేసుకోవటం అందర్నీ ఆలోచింప చేస్తున్నది. 4) ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న అవినీతి అధికారుల మీద కేసులు పెట్టాలన్నా, కొత్త సవరణ సెక్షన్ 13 (1) (సి) 'మెన్సిరియా' ఉండాలని అనటం ద్వారా చట్టాన్ని నీరు కార్చినట్లయింది. ఈ మార్పు ఇంతకు మునుపు లేదు. 'నోన్ సోర్సెస్ ఆఫ్ ఇన్‌కమ్' నిర్వచనాన్ని, పబ్లిక్ సర్వెంట్లకు బెనిఫిట్ వచ్చే విధంగా మార్పు చేయటం జరిగింది. ఎంతవరకు ఈ మార్పులు సమంజసమో, ఏ విధంగా అవినీతి నియంత్రణకు తోడ్పడుతాయో ఇప్పుడే చెప్పటం కష్టం. కొత్తగా సవరణలతో వచ్చిన ఈ పి.సి యాక్ట్ పూర్తిగా అవినీతి అధికారులకే మేలు చేకూరుస్తుందని అనుకోవడం కూడా సరికాదు. బహుశా నిబద్ధతతో పని చేస్తున్న ప్రభుత్వ అధికారుల్ని, నియంత్రణ సంస్థలు అనవసరంగా ఇబ్బందులకు లోను చేస్తున్నాయని, అందుకని అవినీతి నిరోధక చట్టంలో మార్పులు అవసరమని గూడా భావించి ఉండొచ్చు. కానీ ప్రతి నిత్యమూ కింది నుంచి పై వరకు అవినీతిని ఎదుర్కొంటున్న సామాన్యులు ఈ మార్పులను హర్షిస్తారా? ఈ మార్పుల వల్ల తమకు కొంతలో కొంతైనా మేలు జరుగుతుందని భావిస్తారా? కేవలం ఈ సవరణలు అవినీతి అధికారులకు తోడ్పడే విధంగానే ఉన్నాయని అనుకుంటారా? రాబోతున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ సవరణలకు ప్రభుత్వం, పార్లమెంట్ రెక్కలు తొడిగాయని అనుకుంటారా? ప్రస్తుత పరిస్థితుల్లో ఏమీ చెప్పలేము.

(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)

# ప్రభుత్వ అధికారుల్లో జవాబుదారీతనం ఉండాలి

## -లోక్‌సత్తా 'పౌర సేవా కేంద్రం' ప్రారంభం-




ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, ప్రజలకు సేవ ద్వారా చేరువవటమే లోక్‌సత్తా రాజకీయ సంస్కృతి అని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము అన్నారు. పౌరులకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందించటానికి పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇంఛార్జి తోడేటి ప్రసాద్ ఆధ్వర్యంలో బాలాపూర్ మండలం మీర్‌పేట్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన పౌర సేవా కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.


ప్రజలకు నాణ్యమైన సేవల్ని లంచాల్లేకుండా అందించేందుకు ప్రభుత్వాధికారుల్లో జవాబుదారీతనం పెరగాల్సి ఉందని రాము అన్నారు. రాజకీయాల్ని వ్యాపారంగా భావిస్తూ దండుకుంటున్న కాలంలో.. లోక్‌సత్తా వాళ్లు సొంత డబ్బులతో పౌర సేవా కేంద్రాలను నిర్వహిస్తున్నారని, గత 10-15 ఏళ్ల కాలంలో ఇలా అనేక చోట్ల సిటిజన్ సర్వీస్ సెంటర్లు ప్రారంభమయ్యాయని ఆయన వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవల్ని అందించేలా చేసేందుకు 'పౌర సేవల' చట్టం (రైట్ టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ) చట్టాన్ని తీసుకురావటానికి కూడా లోక్‌సత్తా కృషి చేస్తోందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం ముందు సిటిజన్ ఛార్టర్లు ఏర్పాటు చేసి అందులో ప్రతి పనికీ గడువును పేర్కొనాలని, ఆ గడువులోగా పని చేసి పెట్టకపోతే రోజుకు రూ.250 పరిహారం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు చెల్లించాలని లోక్‌సత్తా రూపొందించిన నమూనా చట్టం నిర్దేశిస్తుందన్నారు. తోడేటి ప్రసాద్ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పూర్తి సమాచారం పౌర సేవా కేంద్రంలో ప్రజలకు ఉచితంగా అందిస్తామని, దళారులు, బ్రోకర్ల బారిన పడాల్సిన అవసరమే లేదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ ఉపాధ్యక్షురాలు గంగాభవానీ, కార్యదర్శి శ్రీనివాస్ వర్మ, వైబీఐ నేత శివరామకృష్ణ, సకినాల సత్తయ్య, ఇజూ కుమార్, సాయికుమార్, దినేష్, నవీన్, అమీర్, జావీద్, సందీప్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టం కొందరికి చుట్టం

- పి.వి గోపాలకృష్ణ (అడ్వకేట్),
కో ఆర్డినేటర్, అకాడమీ ఫర్ లీగల్ లిటరసీ ఫర్ ఆల్

వినియోగదారుల రక్షణ చట్టం కింద ఫోరాలు, కమిషన్లు వెలువరించిన తీర్పులలో చాలా మటుకు అమలుకు నోచుకోడంలేదన్నది ఈమధ్య ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో చదివిన ఓ వ్యాసంలోని సారాంశం. ఇది సహేతుకమా లేక వ్యాసకర్త నిరాధార అభిప్రాయమా అన్నది తెలుసుకునే అవకాశం లేదు. దానికి కావలసిన గణాంక వివరాలు ఆ వ్యాసంలో లేవు. గణాంకాల ఆధారంగా వ్యాసకర్త ఆ విషయం విపులంగా చెప్పే ప్రయత్నం చేయలేదు. 2015 నాటి ఫిర్యాదు మీద ఇచ్చిన తీర్పు అమలుకావడానికి మూడేళ్లు పట్టిన విషయాన్ని ఎత్తిచూపుతూ రాసిన వ్యాసం అది. “యంత్రాంగం అలసత్వమే సకాలంలో తీర్పులు అమలు కాకపోడానికి అసలు కారణం. ఆ అలసత్వాన్ని పెంచి పోషించగల సత్తా ఉన్న వాళ్లకి law will take its own course – చట్టం దాని పని అది చేసుకుపోతూ ఉంటుంది – అన్న నానుడి పెద్ద జోక్. వాళ్లకి కావలసినంతకాలం సాగదీయగలమన్నదే వారి ధీమా.”

ఈ అభిప్రాయం – తీర్పులు అమలుకు నోచుకోడంలేదన్న అభిప్రాయం సహేతుకమా లేక నిరాధారమా – కేవలం అభిప్రాయమా లేక నిజమా – అన్నది తెలియాలంటే ఒకటే మార్గం. సమాచార హక్కు చట్టం ఉపయోగించుకోడం.


STOP THINK OF ALL

Academy for Legal Literacy for ALL

31st July 2018

To
THE Public Information Officer
Telangana State Information Commission
Samachara Hakku Bhavan
Mojam-Jahi Market
Hyderabad 500 001

Sub: Application under Section 6 RTI Act, 2005

Sir,

Considering that the purpose of the provision under Section 19 (8) (b) is more to make the public servants answerable and accountable to their masters apart from compensating the loss or detriment suffered due to the deprival of information by the PIO, the following information is sought under Section 6, RTI Act, 2005.

1. The number of cases in which the complainants were compensated under Section 19 (8) (b) since inception.
2. What is the percentage of such cases vis-à-vis the number of cases filed during the last five years?
3. Whether the information is already compiled from the available data? If yes, why is it not uploaded to the website under Section 4 of RTI Act? If no, when will it be compiled and uploaded to the website?

Application fee of Rs. 10/- paid by way of Indian Postal Order No. 43F 958758, dt. 25/07/2018 in favour of The Telangana State Information Commission, Hyderabad

Yours truly,

P.V. Gopalakrishna
Advocate
Coordinator
ALL FOR ALL

ALL for ALL
10/7, First Floor, Damodaran Street, Chetpet, Chennai - 600 031.
+91 9444876148
+91 9440470848
e mail : pvgk010101@gmail.com

Page 1

సాధారణంగా తీర్పు వెలువరించిన తరువాత ఆ తీర్పు ఫలితం అమలుచేసుకోడం ఎవరి పక్షాన ఆ తీర్పు వచ్చిందో వారి బాధ్యత. కోర్ట్ ప్రమేయం ఉండదు. ఏ కారణంచేతైనా ఆ తీర్పు అమలుకాక ఆ పక్షంవాళ్లు తిరిగి కోర్ట్‌ని ఆశ్రయిస్తే తప్ప. అంటే ఈ వారం లేదా ఈ నెలలోనో లేదా ఈ సంవత్సరం ఇన్ని తీర్పులిచ్చేం, అవన్నీ అమలయ్యాయా లేదా వాటి పరిస్థితి ఏమిటి అని వెనక్కి చూసుకునే ఆగత్యం కోర్టులకి లేదు. అమలు చేసుకోలేని పరిస్థితిలో ఏ పక్షం వారైనా తిరిగి ఎక్సిక్యూషన్ – అమలు కోసం – పిటిషన్ పెట్టుకున్న సందర్భంలో కూడా కోర్ట్ ఇతర యంత్రాంగాల మీద ఆధారపడక తప్పదు. తుప్పు పట్టిన ఆ యంత్రాంగంతో ఎలాగోలా పనిచేయించుకోడమే మనం ఇప్పుడు చేస్తున్నది. తుప్పు పట్టకుండా టిప్‌టాప్‌గా ఉంచవలసిన అధికారగణం ఆ పని సక్రమంగా చెయ్యకపోడమే కోర్ట్ తీర్పులు కూడా అతీగతి లేకుండా పోడానికి కారణం.

కానీ పరిస్థితి అంత దారుణంగా ఉందా అన్నదే అసలు ప్రశ్న. దానికి జవాబు సమాచార హక్కు చట్టం ద్వారా వస్తుందా లేదా అక్కడ కూడా ‘చట్టం దాని పని అది చూసుకుంటూ ఉందా’ అన్నది ప్రయత్నించి తెలుసుకోవాల్సి ఉంది.

వినియోగదారుల ఫోరాల్లో కాని, సివిల్ కోర్ట్‌లలో గానీ ఒక సంవత్సర కాలంలో ఎన్ని కేసులు దాఖలయ్యాయి, వాటిలో ఎన్నింటిలో తీర్పులిచ్చారు, వాటిలో ఎన్ని అమలయ్యాయి, ఎన్ని అమలు కాకపోవడం వల్ల ఎక్సిక్యూషన్ – అమలు కోసం తిరిగి వచ్చాయి, ఎన్ని పై కోర్ట్‌లకి అప్పీలుగా వెళ్లాయి, మరోలా చెప్పాలంటే కోర్ట్‌లలో ఏడిచేవారికంటే ఇంటికెళ్లి ఏడిచేవారి అసలు సంఖ్య ఎంత అన్న గణంకాలు చిటికెలో – కంప్యూటర్ మీట నొక్కి తెలుసుకునే వెసులుబాటు ప్రజలకే కాదు ఎక్కడా – అధికారులకి ఆఖరికి ఆనరబుల్ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాకి కూడా – లేదు.

ఇక ఈ సమాచారం ఎలాగ సంపాదించడం, అంటే – సెక్షన్ 6 కింద – ఎవరిని అడుక్కోవడం అన్నది తరువాతి ప్రశ్న. సహజంగా ఈ సమాచారం కోర్ట్ రికార్డులలో ఉంటుంది కనుక శ్రీ కోర్ట్ వారికే విన్నవించుకోవలసి ఉంటుంది. కానీ అడిగిన వెంటనే ప్లేట్లో వడ్డించడానికి సిద్ధంగా ఉండదు. కోర్ట్ సిబ్బంది తమ రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం రాకుండా చేస్తూనో లేక పక్కనపెట్టో సంవత్సరాల తరబడి సూట్ రికార్డ్‌లలో పేరుకుపోయిన

విషయాన్నంతటినీ క్రోడీకరించి ఒక దగ్గరికి చేర్చడానికి సమాచార హక్కు చట్టంలో సూచించిన 30 రోజుల సమయం చాలకపోవచ్చు. వారి దైనందిన కార్యక్రమానికి ఆటంకంగా ఉన్న ఈ సహ దరఖాస్తు పనులు పట్టించుకోకుండా ఉండడానికి అది చాలు. ఇది ఏ ఒక్క శాఖకో పరిమితమైన ధోరణి కాదు. అన్ని ప్రభుత్వ శాఖలు ఈ ఈసడింపు పద్ధతినే అమలు చేస్తూంటాయి.

ఎక్కడైనా నాణ్యమైన న్యాయపాలన అంటే సత్వర న్యాయమే. దాన్ని ప్రజలకి అందుబాటులో ఉంచవలసిన బాధ్యత నిస్సందేహంగా అధికారం చెలాయిస్తున్న ప్రభుత్వానిదే. ప్రభుత్వం అందించే వనరులని సద్వినియోగం చేసుకుని కోర్టులు పనిచెయ్యవలసి ఉంటుంది. అందువల్ల కావలసిన వనరులని సద్వినియోగం చేసుకుని కోర్టులు పనిచెయ్యవలసి ఉంటుంది. అందువల్ల కావలసిన వనరులని అందించడమే కాకుండా వనరుల సద్వినియోగం, కోర్ట్ల పనితీరుని గమనించవలసిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. అప్పుడు కోర్ట్‌లలో సకాలంలో ఎన్ని కేసులు తీర్పులకి నోచుకుంటున్నాయి, ఫైలయిన కేసుల్లో వాటి శాతం ఆశాజనకంగా ఉందా నిరాశాజనకంగా ఉందా, ఆ లక్ష్యాన్ని సాధించడానికి అవలంబించవలసిన పద్ధతులేమిటి అని చూడవలసిన బాధ్యత కూడా ప్రభుత్వంలోని న్యాయమంత్రిత్వ శాఖదే అవుతుంది. కానీ ఆ శాఖ అటువంటి గణాంకాల సమాచారం కోర్టుల నుంచి సేకరించి సహ చట్టం సెక్షన్ 4 కింద తనంతట తానుగా ప్రజలకి అందించడానికి ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు. కోర్టులు కూడా తమంతా తాముగా ఆ సమాచారం ప్రభువులకి అంటే ప్రజలకి అందుబాటులో ఉంచే ప్రయత్నం చెయ్యనప్పుడు గత్యంతరం లేని పరిస్థితుల్లో సహ చట్టం కింద ప్రభువులు ఆ రికార్డులు నిర్వహిస్తున్న సేవకులనే ఆ సమాచారం కోసం అర్థించవలసి వస్తుంది.

సకాలంలో కోర్టులు తీర్పులు ఇచ్చినంత మాత్రానే అది నాణ్యమైన న్యాయమా?

డబ్బు పోయె శనీ పట్టే అన్న పద్ధతిలో కోర్టులో కేసు వేసేక ఒక తరం జీవితకాలం ముగిసేక వచ్చిన తీర్పు అమలు కాకపోతే అది ఏ విధమైన నాణ్యమైన న్యాయమవుతుంది?

పరిస్థితి అంత దారుణంగా లేదు అని నచ్చచెప్పుకోవాలంటే సకాలంలో నాణ్యమైన సమాచారం – నూటికి నూరు కాకపోయినా, ఫైలైన కేసుల్లో 'సత్వరం' అందించిన తీర్పులలో ఎన్ని అంతే సత్వరంగా అమలయ్యాయన్న సమాచారం – సేవకులు సత్వరం అందించాలి.

ఇది సహ చట్టం మరొక ప్రహసనం.

సకాలంలో సమాచారం ఇవ్వని పబ్లిక్ అథారిటీలని బాధ్యులని చెయ్యడానికి, వారి జవాబుదారీకి ఉద్దేశించిన పరిహారం ఏర్పాటు నీరుగారి చట్టంలో సెక్షన్ 19 (8) (బి)గా రూపాంతరం చెందింది. దాని ప్రకారం ఈ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి వేళ్ల మీద లెక్కపెట్టగలిగినన్ని కేసులలో కూడా పరిహారం అందిన దాఖలాలు లేవు. (అది – ఆ సమాచారం తెలుసుకోడానికి మళ్లీ సహ చట్టం కింద దరఖాస్తు చేసుకోవాల్సిందే). సహ అమలు జవాబుదారీతనానికి అధికారులను బాధ్యులను చెయ్యలేని విధంగా రూపొంది చట్టంలో పొందుపరచిన ఆ సెక్షన్ వాక్యనిర్మాణం చూడండి –

19. **Appeal.-**

*(8)* In its decision, the Central Information Commission or State Information Commission, as the case may be, has the power to -

*(b)* require the public authority to compensate the complainant for any loss or other detriment suffered;

అంటే సకాలంలో అడిగిన సమాచారం ఇవ్వని పబ్లిక్ అథారిటీని బాధ్యులని చెయ్యడమో జవాబుదారీ చెయ్యడమో ఈ సెక్షన్ ఉద్దేశం కాదు. ఆ సమాచారం అందించకపోయి నందువల్ల ఏర్పడే కష్టనష్టాలకి పరిహారం కోసం ఉద్దేశించినది.

పైన చెప్పిన వినియోగదారుల తీర్పుల అమలుకు సంబంధించి చేసుకున్న విన్నపానికి సకాలంలో సమాచారం రాకపోయినట్లయితే వ్యక్తిగతంగా ఎవరికైనా వచ్చే కష్టం కాని నష్టం కాని ఏముంటుంది. అది సామాజికమైనది. బాధ్యతారాహిత్యానికి తగిన శిక్షలేకపోడం, అధికారగణ ఆలోచనలో మార్పురాకపోడం అన్నవి సమాజానికి నష్టం కలిగించి భ్రష్టు పట్టించే విషయాలు.

సేవకగణంలో Official Secrets Act hangover ఇంకా వదలని ప్రస్తుత సమాజంలో సత్వర సహ అమలు సాధ్యమవాలంటే, మంత్రులు oath of secrecyతోపాటు oath of information కి కూడా బద్ధులు కావాలి. ప్రత్యేకంగా ప్రభుత్వ శాఖల సమాచార సమీకరణకి దరఖాస్తులతో ప్రమేయం లేకుండా ప్రభువులకి సమాచారం అందుబాటులో ఉంచడానికి ఒక ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఉండాలనుకోడం అత్యాశ. అదే జరగాలంటే లోక్‌సత్తా చేతికి పగ్గాలు రావాల్సిందే.

# పాత్రికేయ దీపుడు


- ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

అత్యవసర పరిస్థితి చీకట్లను ఛేదించుకుంటూ స్వేచ్ఛాభానుడు భారతదేశంపై అప్పుడప్పుడే ఉదయిస్తున్న వేళ... నేను పాఠశాల విద్యార్థిగా ఉన్న రోజులవి. గ్రంథాలయంలో ఒకరోజు అనుకోకుండా కులదీప్ నయ్యర్ రాసిన 'ది జడ్జిమెంట్' పుస్తకం నా కళ్లపడింది. అత్యవసర పరిస్థితి నాటి భారతదేశ స్థితిగతులను ఏకరువు పెడుతూ ఆయన విరచించిన ఆ పుస్తకంలో చర్చించిన స్వేచ్ఛాయుత పాత్రికేయం, ప్రజాస్వామిక రాజకీయం అన్న భావాలు నాపై ప్రగాఢ ప్రభావం చూపించాయి. వార్తా ప్రసార మాధ్యమాలను వ్యాపార దృక్పథంతోనే చూడరాదు. పాత్రికేయులు కేవలం ఉద్యోగులే కారు. వార్తా ప్రసార మాధ్యమాలు కొన్ని నిర్దిష్ట సామాజిక బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది.

**ప్రజల పక్షాన పూరించిన శంఖం**

విశ్వసనీయ సమాచారాన్ని ప్రజలకు అందించడంతోపాటు- ప్రజల తరపున అధికార వ్యవస్థలను ప్రశ్నించడమూ వాటి గురుతర బాధ్యత. నిత్య చైతన్యశీలమై ప్రజానుకూల ఎజెండాను సమాజంలో విస్తరించడం వాటి విధి. దురదృష్టవశాత్తు ఈ విశిష్టతలు, విలువలు క్రమక్రమంగా కొడిగడుతున్నాయి. ప్రమాణాలు పతనోన్ముఖం అవుతున్న దశలో విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పాత్రికేయ మేరునగం కులదీప్ నయ్యర్. విమర్శలను సహించలేని అధికారం, ప్రజాస్వామ్యాన్ని కబళించే రాజకీయం స్వేచ్ఛకు గ్రహణం పట్టించిన వేళ పిడికిలి బిగించి పోరాడిన యోధుడు కులదీప్ నయ్యర్! ఉదయించే వార్తలను శాసించాలని చూసే నేతలకు కొరతలేని నేటి రోజుల్లో కులదీప్ నయ్యర్ వంటివారు లేని లోటు తీర్చలేనిది!

పాత్రికేయుడు శ్రమను అమ్ముకునే కలం




విలువల కలం... కులదీప్ నయ్యర్

కార్మికుడే కాదు, కార్యరంగంలోకి దూకి హక్కుల కోసం పోరాడే సమరశీలీ అని నిరూపించిన ధీరుడు కులదీప్ నయ్యర్! పాత్రికేయుడు నాలుగు గోడలకే పరిమితం కావాలని ఆయన ఎన్నడూ భావించలేదు. అందుకు కారణం ఆయనకు జర్నలిజం కేవలం వృత్తి, ప్రవృత్తి మాత్రమే కాదు. పాత్రికేయాన్ని సమాజ చైతన్యానికి ఒక బలమైన ఆయుధంగా పరిగణించారాయన. అందుకే తన నుంచి ఆ ఆయుధాన్ని కాజేయాలని అధికారం చూసినప్పుడు కులదీప్ నయ్యర్ వీరోచితంగా పోరాడారు. నిర్బంధాలను లెక్కచెయ్యలేదు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా గళమెత్తి, రాజీలేని పోరాటం సాగించి, జైలు జీవితాన్నీ ఎదుర్కొన్నారాయన.

దేశ విభజన సమయంలో కులదీప్ నయ్యర్‌కు 24 ఏళ్ల వయసు. ఆ సందర్భంగా జరిగిన మతోన్మాద సంఘర్షణలు, మారణ హోమానికి ఆయన మౌనసాక్షిగా నిలిచారు. నయ్యర్ వ్యక్తిత్వంపై బలమైన ముద్ర వేసిన ఘటనలవి. ప్రస్తుత పాకిస్తాన్‌లోని సియల్‌కోట్‌లో నయ్యర్ జన్మించారు. 'సెప్టెంబర్ 30, 1947లో సరిహద్దులు దాటిన తరుణంలో మతం పేరిట చెలరేగిన రక్తపాతం, వినాశం చూశాను. ఆ రోజే నాకు నేనుగా ప్రతినపూనాను. స్వాతంత్ర్యానంతరం నూతన భారతావనిలో కుల, మత విభేదాలకమూలంగా ఎట్టి పరిస్థితుల్లోనూ హింసను

అనుమతించరాదు'– ఆయన రాసిన 'స్కూప్' అనే పుస్తకంలోని వ్యాఖ్యలివి. కానీ, సమకాలీన భారతంలోనూ నయ్యర్ కలలు పూర్తిగా ఫలించకపోవడం ఆందోళన కలిగించే అంశం. దశాబ్దాల క్రియాశీల ప్రస్థానంలో అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిన ఎన్నో సంచలన వార్తలను నయ్యర్ అందించారు. ఎమర్జెన్సీ అనంతరం ఎన్నికలకు వెళ్లేందుకు ఇందిరాగాంధీ నిర్ణయించడం, అణ్వాయుధాలను తయారుచేసుకోవాలన్న పాకిస్తాన్ నిర్ణయం, పాక్ మాజీ ప్రధాని భుట్టోను ఉరితీసేందుకు సైన్యం పూనుకోవడం వంటి కీలక వార్తలను ఆయన ప్రపంచానికి అందించారు. పరిశోధనాత్మక జర్నలిజం కరవైన నేటి తరంలో నయ్యర్ స్ఫూర్తి పాత్రికేయ ప్రపంచానికి దారిదీపం కావాలి. డబ్బు కోసమో, పదవుల కోసమో, ప్రతిష్ఠ కోసమో ఆయన ఏనాడూ పరితపించలేదు. మనస్సాక్షి ప్రకారమే కలం ఝుళిపించిన పాత్రికేయ భీష్మాచార్యులాయన. రాజ్య నిర్బంధం ఫలితంగా– ప్రజాస్వామ్య, పౌర, మానవ హక్కులు హననమవుతున్న తీరును తన పదునైన వార్తలు, ఆలోచనాత్మక వ్యాఖ్యలు, తిరుగులేని రచనల ద్వారా తెలియజెప్పి ప్రపంచాన్ని జాగృతం చేసిన ఉద్యమకారుడు కులదీప్ నయ్యర్!

కుండ బద్దలు కొట్టినట్లుగా భావాలను వ్యక్తీకరించడం ఆయన శైలి. 'రాజకీయాలు, అధికారస్వామ్యం, పారిశ్రామిక రంగం, పత్రికా యాజమాన్యాలు, పాత్రికేయులు... ఇలా అనేక రంగాల్లో ప్రముఖులను చూశాను. వారిలో అత్యధికుల పనితీరు నాకు అసంతృప్తినే మిగిల్చింది. ఉన్నత స్థానాలకు చేరినవారిలో అత్యధికులకు నిజానికి ఆ అర్హత లేదు. వారు అధికారం చలాయిస్తున్నారు... కానీ వారిలో సరకు లేదు'– 'బియాండ్ ది లైన్స్' పేరిట రాసుకున్న ఆత్మకథలో ఆయన వ్యాఖ్యలివి.

**భారత్, పాక్‌ల నడుమ శాంతి వారధి**

పాకిస్తాన్‌తో శాంతి, సామరస్యాల కోసం నయ్యర్ నిరంతరం తపించారు. ఆనాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి లాహోర్‌కు జరిపిన బస్సు యాత్రలో ఆయన సైతం పాల్గొన్నారు. ఉభయ దేశాల ప్రజల మధ్య సంబంధ బాంధవ్యాలే ప్రాతిపదికగా ఉపఖండంలో శాంతిని విరబూయించాలని అహరహం పరితపించారు. 'భారత్, పాకిస్తాన్‌ల సంబంధాలు మెరుగుపడాలన్నది నా ప్రగాఢ వాంఛ మాత్రమే కాదు... నా ప్రార్థన కూడా! స్నేహపూర్వకంగా, పరస్పర ప్రయోజనాల కోసం భారత్, పాకిస్తాన్‌లు కలిసి పనిచేసే రోజు వస్తుందని ఆశిస్తున్నాను'– నయ్యర్ తన ఆత్మకథలో రాసుకున్న అభిప్రాయాలివి. కానీ ఆ ఆశ తీరక ముందే ఆయన తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. భారత ఉపఖండంలో శాంతి, సామరస్యాల కోసం రెట్టింపు నిబద్ధతతో పనిచేయడమే ఆయనకు సిసలైన నివాళి అవుతుంది.

దేశ విభజన, పాకిస్తాన్ ఏర్పాటు ఆయన వ్యక్తిగత జీవితాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేసిన ఘటనలు. మతం పేరిట చెలరేగిన మారణహోమాన్ని, ఇరువర్గాల మధ్య రక్తపాతాన్ని దగ్గరనుంచి చూసినప్పటికీ ఆయన అతివాదిగా మారలేదు. శాంతి దూతగానే జీవితాంతం గడిపారు. భారత్, పాకిస్తాన్‌లలోని యుద్ధ పిపాసులకు కులదీప్ నయ్యర్ తిరుగులేని సమాధానంగా నిలిచారు. 'విస్తృత అనుభవం సాధించాలన్నది నా తపన' అని చెప్పుకొనేవారాయన. అందుకు తగినట్లుగానే జీవితంలో బహుముఖ బాధ్యతలను అలవోకగా నిర్వహించారు. సంపాదకుడిగా, పార్లమెంటేరియన్‌గా, దౌత్యవేత్తగా, రాజకీయ వ్యాఖ్యాతగా, రచయితగా... కాలుమోపిన ప్రతి రంగంలోనూ అద్భుతమైన ప్రమాణాలు నెలకొల్పుతూ వర్ధిల్లిన స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం ఆయనది. 'నేను అనేక వైఫల్యాలు చూశాను. నాలో ఇంకాస్త శక్తి ఉంటే మరిన్ని కలలను సాకారం చేసుకునేవాణ్ని' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు నయ్యర్ వినయసంపన్నతకు అద్దం పడతాయి. దేశ విభజన తరవాత భారత్‌కు కాందిశీకుడిగా వచ్చిన ఆయన– ఇంతటి ఉన్నత శిఖరాలు అధిరోహించడం ఎందరికో స్ఫూర్తి పాఠం. 'సరైనదనుకున్న దారిలో పయనించే, న్యాయమైనదని భావించినదాని కోసం పోరాడే క్రమంలో ఏనాడూ నన్ను వైఫల్యాలు నిరుత్సాహపరచలేదు. పర్యవసానంగా ఎన్నో కష్టాలు అనుభవించాను. నేటికీ ఆ గాయాలు మిగిలిపోయాయి. కానీ, ఏదో ఒకనాడు విజయం సాధిస్తానన్న విశ్వాసమే నన్ను ముందుకు నడిపిస్తోంది'– నయ్యర్ ఈ వ్యాఖ్యలు వర్తమానంలో ఉన్న, భవిష్యత్తులో రానున్న పాత్రికేయులకు జీవనగీతం కావాలి... వికాస పాఠాలై మునుముందుకు నడపాలి!

(ఈనాడు సౌజన్యంతో)

# 99.3 శాతం తిరిగొచ్చేశాయ్!

పెద్ద నోట్లు రద్దు (డీమానిటైజేషన్) నేపథ్యంలో తిరిగి బ్యాంకులకు చేరిన నోట్లు 99.3 శాతం మేర ఉన్నాయని రిజర్వు బ్యాంకు ప్రకటించింది. 2016 నవంబర్ 8వ తేదీన రద్దు చేసిన రూ.1000, రూ.500 నోట్లలో కేవలం 0.7 శాతం మాత్రమే జమ కాలేదని వార్షిక నివేదికలో వెల్లడించింది. రద్దయిన నోట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసినట్టు తెలిపింది.

దాదాపు రెండేళ్ల క్రితం పెద్ద నోట్ల రద్దును ప్రకటించాక.. పరిమితకాలంలోనే ఈ నోట్లను బ్యాంకుల వద్ద మార్చుకునే లేదా డిపాజిట్ చేసే సదుపాయాన్ని కల్పించారు. ఇలా వచ్చిన నోట్లను లెక్కించటానికి ఆర్‌బీఐ ఇంత సమయం తీసుకుంది.

నల్లధనం వెలికితీత, అవినీతి నిర్మూలన, నకిలీ నోట్ల ఏరివేత, డిజిటల్ లావాదేవీల పెంపు అన్న నాలుగు ప్రధాన లక్ష్యాలతో పెద్ద నోట్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటిస్తూ.. ప్రభుత్వం అప్పట్లో రూ.15.41 లక్షల కోట్ల విలువ చేసే పెద్ద నోట్లను రద్దు చేసింది. వీటిలో రూ.3 లక్షల కోట్లు తిరిగి బ్యాంకుల్లో జమ కాదని, అది నల్లధనంగా తేలుతుందని అంచనా వేసింది. అయితే రూ.15.31 లక్షల కోట్లు (99.3 శాతం) తిరిగి బ్యాంకుల్లో జమయింది. కేవలం రూ.10,720 కోట్లు మాత్రమే తిరిగి రాలేదు. పన్నులు చెల్లించాల్సి వస్తుందన్న భయంతోనే దీన్ని జమ చేసి ఉండరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రద్దయిన పాత పెద్ద నోట్లను స్పెసిఫైడ్ బ్యాంక్ నోట్స్‌గా ఆర్‌బీఐ పేర్కొంది. హైస్పీడ్ కరెన్సీ వెరిఫికేషన్, ప్రాసెసింగ్ సిస్టమ్ ద్వారా నోట్ల లెక్కింపును పూర్తి చేసినట్టు నివేదికలో తెలిపింది.

### కొత్త నోట్ల ముద్రణకు భారీ వ్యయం

రిజర్వు బ్యాంకు వార్షిక లెక్కలకు జులై నుంచి



జూన్ నెల వరకు ఉన్న కాలాన్ని పరిగణలోకి తీసుకుంటారు. దీన్నే అకౌంటింగ్ ఇయర్‌గా పరిగణిస్తారు. ఈ లెక్కల ప్రకారం కొత్త నోట్లు కారణంగా ముద్రణ ఖర్చు భారీగా పెరిగింది. కొత్తగా రూ.500, రూ.2000 నోట్లు తీసుకురావడమే ఇందుకు కారణం. ముద్రణ వ్యయం 2016-17లో రూ.7,965 కోట్లు కాగా, అంతకుముందు సంవత్సరం రూ.3,421 కోట్లు మాత్రమే. 2017-18లో నోట్ల ముద్రణ వ్యయం రూ.4,912 కోట్లుగా ఉంది.

### పడిపోయిన లాభాలు

నోట్ల ముద్రణ ఖర్చు భారీగా పెరగడంతో రిజర్వు బ్యాంకు లాభాలు కూడా తగ్గిపోయాయి. ఈ కారణంగా ప్రభుత్వానికి రిజర్వు బ్యాంకు చెల్లించిన డివిడెండ్ కూడా భారీగా తగ్గిపోయింది. 2017 జూన్ 30న రూ.30,659 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.65,876 కోట్లు. 2018లో మాత్రం డివిడెండ్‌లో మెరుగుదల కనిపించింది.

### ఆగని నకిలీ నోట్లు

నకిలీ నోట్లను అదుపు చేయాలన్నది నోట్ల రద్దు ప్రక్రియ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. కానీ అది కూడా నెరవేరలేదని తేలింది. రద్దయిన కాలంలో నిజానికి పెద్ద నోట్లలో నకిలీల సంఖ్య తగ్గింది. 2016-17లో రూ.500 నోట్లలో 199 నకిలీలు, రూ.2000 నోట్లలో 638 నకిలీలు దొరికాయి. అదే 2017-18లో వాటి సంఖ్య విపరీతంగా పెరిగింది. రూ.500 నోట్లలో 9,892 నకిలీలు, రూ.2,000 నోట్లలో 17,929 నకిలీలు లభించాయి. రూ.50, 100 నోట్లలోనూ నకిలీ సంఖ్య పెరిగింది.

### లక్ష్యాలు సాధించామని చెప్పుకున్న ఆర్థిక శాఖ

నోట్ల రద్దు లక్ష్యాలను చాలావరకు సాధించామని కేంద్ర ఆర్థిక శాఖ అభిప్రాయపడింది. నల్లధనాన్ని అదుపు చేయడం, ఉగ్రవాదులకు నిధులు అందకుండా నిరోధించడం, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం, నకిలీ నోట్లను అరికట్టడం వంటివి నోట్ల రద్దు లక్ష్యాలని, వాటిని గణనీయంగా సాధించామని భావిస్తున్నామని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అన్నారు.

# కేరళ బాధితులకు లోక్‌సత్తా పార్టీ చేయూత








వరద బీభత్సంతో అతలాకుతలమైన కేరళ ప్రజలకు గుంతకల్ లోక్‌సత్తా పార్టీ తన వంతు చేయూతనందించింది. బాధితుల సహాయార్థం వారం రోజులపాటు విరాళాల్ని, నిత్యావసర వస్తువులు, దుస్తులు, ఇతర సామాగ్రిని లోక్‌సత్తా గుంతకల్ నియోజకవర్గ అధ్యక్షుడు సన్నపొడమల రామ్మోహన్ ఆధ్వర్యంలో సేకరించారు. ప్రత్యేక వాహనం ద్వారా కేరళకు తీసుకెళ్లి తిరువనంతపురంలోని ఆర్‌టీవో అధికారులకు అప్పగించారు. పలువురు లోక్‌సత్తా నాయకులు, కార్యకర్తలు ఈ సేవాకార్యక్రమంలో పాల్గొన్నారు.

## అండగా ఉందాం




కేరళలోని వరద బాధిత ప్రజలను ఆదుకోవటానికి విజయనగరం జిల్లా జానపద కళాకారుల బృందం సహకారంతో డా॥ పి.వి.జి రాజు కళావేదిక ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామని కళావేదిక అధ్యక్షుడు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. నగరంలోని కోట జంక్షన్ వద్ద వితరణ సేకరణను ఆయన ప్రారంభించారు. కేరళలోని జలప్రళయం పట్ల దేశవ్యాప్తంగా మానవీయ




స్పందనను కనబరచటం అభినందనీయమన్నారు. జానపద కళాకారుడు, రేలారేరేలా ఫేం జానకిరామ్ మాట్లాడుతూ, కళావేదికతో కలిసి చేపట్టిన కార్యక్రమానికి ప్రజలు సేవాభావంతో స్పందిస్తున్నారన్నారు. వేదిక కార్యదర్శి కొత్తా సునీల్, కళాకారులు మోహన్, డప్పు రమేష్, డప్పు గణేష్, శివ, కార్యకర్తలు ఎం. చిన్నారావు, ఎ. నాగభూషణం, ఎస్. శ్రీను, పి. అప్పారావు, భాస్కర్, ఆర్. గురునాథం, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యక్ష ఎన్నికలే పరిష్కారం

స్థానిక ప్రభుత్వాల్లో భాగమైన మండల, జిల్లా పరిషత్‌లలో కొనుగోళ్ల ద్వారా అవిశ్వాసాలకు తెర లేపకుండా ప్రత్యక్ష ఎన్నికలను పెట్టాలని లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం అధ్యక్షుడు బి.వెంకటరమణబాబు డిమాండ్ చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీలు గెలవటానికి క్యాంపు రాజకీయాలు చేసి, డబ్బులు చేతులు మారితే ఇక ప్రజలకు ఏం సేవ చేస్తారని ప్రశ్నించారు. ఆరు మాసాలు కాలవ్యవధి కూడా లేని మండల అధ్యక్ష పదవి నుంచి కూడా దించటానికి యత్నాలు చేయటం అధికార పిచ్చికి నిదర్శనమన్నారు. డి.హీరేహాళ్ ఎంపీపీపై పెట్టిన అవిశ్వాస తీర్మానం అధమ రాజకీయమన్నారు. ముఖ్యమంత్రులకు కూడా ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహిస్తే ఎమ్మెల్యేల కొనుగోళ్ల ఫిరాయింపులకు కూడా అడ్డుకట్ట పడుతుందన్నారు.

# పంచాయతీ ఎన్నికల వాయిదా రాజ్యాంగ విరుద్ధం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఎన్నికల రాజకీయ స్వార్థం కోసం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నారని, రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా పంచాయతీ ఎన్నికలను వాయిదా వేసి ప్రత్యేక అధికారుల పాలనను కొనసాగిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రభుత్వం వెంటనే పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ అఖిలపక్షం తరపున ఆయన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి డా॥ కేఎస్ జవహర్ రెడ్డిని కలిసి విజ్ఞాపన పత్రం అందించారు. రాష్ట్రంలోని 12,958 పంచాయతీల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేకుండా చేసి.. అధికారులను పార్టీ కార్యకర్తల్లా, దూతల్లా ఉపయోగించుకునే అప్రజాస్వామిక ధోరణులకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. ఇప్పటికే దొడ్డిదారిన పనిచేస్తున్న జన్మభూమి కమిటీలు స్థానిక సాధికారతను దెబ్బతీస్తున్నాయన్నారు. ఇలా ప్రజాస్వామ్యాన్ని కాలరాయటాన్నే రాజకీయ చాణక్యంగా చంద్రబాబు వర్ణించుకోవటం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో



జవాబుదారీతనం లేకుండా పోయిందని, స్థానిక ప్రభుత్వాల ద్వారా ఎన్నికైన ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. స్థానిక సంస్థల చాంబర్ జాతీయ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ, ప్రత్యేక అధికారుల పాలనకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ప్రత్యేక ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. జవహర్‌రెడ్డిని కలిసినవారిలో చాంబర్ ప్రతినిధులు సర్వ, శ్రీనివాస్, ఆచారి తదితరులున్నారు.

## కంటి వెలుగును సక్రమంగా నిర్వహించాలి

కంటి వెలుగు పథకం ఔచిత్యాన్ని అలా ఉంచితే, నిర్వహణలో కూడా నిర్లక్ష్యం కనిపిస్తోందని లోక్‌సత్తా పార్టీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లేటి రమేష్ అన్నారు. ప్రకటనల్లో పద్మ కుటుంబంపై చేసిన తప్పులకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ప్రభుత్వం స్పెషలిస్టు డాక్టర్‌లా ఒక్కో విభాగానికి సంబంధించి శిబిరాల్ని నిర్వహించకుండా.. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేసి అందరికీ నాణ్యమైన వైద్యాన్ని ఎటువంటి ఆర్థిక భారం లేకుండా అందించాలని డిమాండ్ చేశారు.

## లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అడహాక్ కమిటీ సమావేశం

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో లోక్‌సత్తా పార్టీ బలోపేతానికి వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నియమించిన తెలంగాణ అడహాక్ కమిటీ సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. స్థానిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా లోక్‌సత్తా నేతలు, కార్యకర్తలతో సమావేశాలు, పార్టీ బలోపేతం గురించి సభ్యులు చర్చించారు. లోక్‌సత్తా లక్ష్యసాధన దిశగా ఎన్నికలను ఉపయోగించుకునేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఏర్పాటు చేసిన అడహాక్ కమిటీలు ఈనెల 30 తర్వాత తమ నివేదికల్ని జేపీకి అందచేస్తాయి. తదనుగుణంగా చర్చించి కార్యాచరణ చేపడతారు. సమావేశంలో



పర్చా కోదండరామారావు, ఎస్.వి గజానని, నందిపేట రవీందర్, పి. రవిమారుత్, సాతులూరి గోవిందరావు, ఎల్.వి రామరాజు, తుమ్మనపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

○ మనదేశంలో అత్యధికులకు సరైన చికిత్స అందకపోవడమే కాదు, ఉన్న కొద్ది ఆరోగ్య సేవలూ పరమ నాసిరకంగా ఉన్నాయి. గ్రామీణ జనాభాలో 66 శాతానికి రోగం రాకుండా చూసుకునే అవగాహన లేదు. ఏదైనా రోగం వచ్చినప్పుడు చికిత్స చేయించుకోవాలంటే 33 శాతం గ్రామీణులు కనీసం 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా వైద్య చికిత్స వ్యయంలో మూడో వంతును రోగులు స్వయంగా భరిస్తుంటే, భారత్‌లో 70 శాతం ఖర్చులను సొంత జేబు నుంచి పెట్టాల్సి వస్తోంది. ఇంత ఖర్చుకు తగ్గ నాణ్యమైన చికిత్సా లభించడం లేదు. దీనిపై అనేక అధ్యయనాల సారాంశాన్ని 'ది ఎకనామిస్ట్' పత్రిక గతంలో ప్రచురించింది. సుశిక్షిత వైద్య సిబ్బందే రోగుల మాదిరి అభినయిస్తూ ప్రపంచవ్యాప్తంగా పలు ఆస్పత్రులకు వెళ్లి రకరకాల రోగ లక్షణాలను ఏకరువు పెట్టారు. 30 శాతం కేసుల్లో మాత్రమే సరైన చికిత్స లభించింది. 42 శాతం కేసుల్లో అనవసర, హానికర చికిత్స లభించింది. మరొక అధ్యయనంలో కేవలం 31 శాతం వైద్యులే ఉబ్బసం, నీళ్ల విరేచనాల రోగులకు సరైన మందులు, చికిత్స సూచించగలిగారు. భారతదేశంలో వైద్య చికిత్స ఎంత నాసిరకంగా ఉందో ఈ అధ్యయనాలు తెలుపుతున్నాయి. పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 25 నుంచి ప్రారంభంకానున్న ఆయుష్మాన్ భారత్ పథకం ప్రస్తుత దుస్థితి నుంచి గ్రామీణ పేదలు, పట్టణ కార్మికులను ఆదుకోవడానికి ఏ మేరకు ఉపకరించనుంది?

– డాక్టర్ మహేంద్రబాబు కురువ

○ నీతి ఆయోగ్ వల్ల ఏ పరివర్తనా జరగలేదు. దాని తీరు.. పేరు గొప్ప ఊరు దిబ్బలా ఉంది. సహకార సమాఖ్య లేనే లేదు. 70 ఏళ్ల ప్రజాస్వామ్యంలో వికేంద్రీకరణ జరగాల్సి ఉన్నా, ఒకే చోట కేంద్రీకృతమయ్యేలా చేస్తున్నారు. ఇది సరికాదని నీతి ఆయోగ్ సమావేశంలోనే కేంద్రానికి చెప్పాను. విద్య విషయానికే వస్తే.. గద్వాల జిల్లా గట్టు మండలంలోని పాఠశాల గురించి కేంద్రానికి ఏం సంబంధం ఉంటుంది? అది రాష్ట్రానికే వదిలేయాలి. పరిస్థితిని బట్టి నిధులు వినియోగించుకోవడానికి ఆస్కారం ఉంటుంది. కాంగ్రెస్‌దేమో మొఘల్ రాచరికం.. బీజేపీ మాటలేమో తియ్యగా ఉంటున్నాయి తప్ప, చేసిందేమీ లేదు.

- కేసీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి

○ *ప్రపంచవ్యాపంగా ఉన్న ఎన్నారైల (ప్రవాస భారతీయుల)ను ఇండియాలోని 543 లోక్‌సభ నియోజకవర్గాలకూ విభజిస్తే వీరి సంఖ్య ఒక్కో నియోజకవర్గానికి 21 వేలుగా తేలుతుంది. ఇది సామాన్యమైన సంఖ్య కాదు. చాలాచోట్ల ఫలితాన్ని ప్రభావితం చేయగలదు. అంతేకాదు, ఎన్నారైలు భారత్‌లోని తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను కూడా ప్రభావితం చేయగలిగే స్థాయిలో ఉన్నారు. ఇన్నాళ్లు ఎన్నారైల నిధుల కోసం వెంటపడే పార్టీలు ఇప్పుడు వారి ఓటు కూడా తమకు వేయాలని కోరేందుకు సిద్ధమవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఎన్నారైలు కీలకం కావడంతోపాటు అవసరమైతే ప్రత్యక్షంగా ఎన్నికల్లో దిగేందుకు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.*

*– చెన్నూరి వెంకట సుబ్బారావు,*
*అమెరికాలో ప్రచురితమయ్యే 'తెలుగు టైమ్స్' పత్రిక ఎడిటర్*

○ *కనీసం జయలలిత మీద ఉన్న ఆదాయ పన్ను కేసుల దర్యాప్తును నీరుగార్చడానికి సమ్మతించినా గతంలో వాజ్‌పేయీ ప్రభుత్వం గట్టెక్కేది. ఆయన ఆ పని చేయకుండా ఓటమిని వరించారు. వాజ్‌పేయిలాంటి రాజకీయ నాయకులు ఇప్పుడు కలికానికి కూడా కనబడరు. అందరూ రాజకీయ చాణక్యులమనిపించుకోవడానికి పోటీపడేవారే. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలకు పాతరేసి అధికారం సంపాదించడం, దాన్ని నిలబెట్టుకోవడమే పరమావధిగా భావించే బాపతు నేతలు ఎక్కువైపోయారు.*

*- వీరేంద్ర కపూర్*

*○ మా పార్టీకి చెందిన ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి గతంలో ఇంటింటికీ సెల్‌ఫోన్ పంచి ఓట్లు అడిగారు. భార్యాభర్తలు ఇద్దరూ ఓటర్లయితే ఇరువురికీ సెల్‌ఫోన్ ఇవ్వాల్సి వచ్చింది. ఎన్నికల్లో రూ.20 కోట్లు ఖర్చు చేసిన వ్యక్తి గెలుపొందాక అవినీతికి పాల్పడకపోతే ఇంట్లో అతని భార్య కూడా నిలదీస్తుంది. టీడీపీ స్థాపించిన రోజుల్లో రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యం ఉండేది. ఈ రోజుల్లో ఏదైనా పార్టీ టికెట్ కోసం ప్రయత్నిస్తే డబ్బు ఎంత ఉంది? రూ.10 కోట్లు ఉన్నాయా? రూ.20 కోట్లు ఉన్నాయా? అని ప్రశ్నిస్తున్నారు.*

*– చింతకాయల అయ్యన్న పాత్రుడు,*
*ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ మంత్రి*

○ అయిష్టంగానే పాత్రికేయ వృత్తిలోకి కులదీప్ నయ్యర్ ప్రవేశించారు. అయితే, చెప్పుకోదగ్గ ప్రావీణ్యంతో ఆయన జీవితాంతం జర్నలిస్టుగానే బతికారు. అయితే, కులదీప్‌కు సంబంధించి వీటన్నిటికన్నా ముఖ్య విషయం ఒకటుంది. చాలామందికి ఇప్పటికీ ఇది తెలియదు. మానవ చరిత్రలోనే అత్యంత పాశవిక సందర్భంగా భావించే దేశ విభజన రోజులవి. మతం ప్రాతిపదికగా జరిగిన ఈ విభజన సందర్భంగా 1947 ఆగస్ట్-సెప్టెంబర్ మాసాల్లో ఇండియా, పాకిస్తాన్‌లో జరిగిన మత ఘర్షణల్లో రక్తం ఏరులై పారింది. ఆ సమయంలో పాకిస్తాన్ నాయకుడు మహమ్మదలీ జిన్నా లాహోర్ పర్యటనకు వచ్చారు. జిన్నాతోపాటు ఓ మంత్రి, ఒక జర్నలిస్టు కూడా విమానంలో లాహోర్‌కు చేరుకున్నారు. మత ఘర్షణల ఫలితంగా లక్షలాది మంది జనం పాకిస్తాన్‌లోకి రావడం, అంతేసంఖ్యలో దేశం నుంచి ఇండియాకు పారిపోవడం స్వయంగా జిన్నా గమనించారు. ఈ దారుణ దృశ్యాలను కళ్లారా చూసిన జిన్నా బాధతో నుదిటిపై చేయి వేసుకుని "నేనెంత పని చేశాను?" అని నిరాశతో అన్నారు. జిన్నా అన్న మాటలు ప్రపంచానికి వెల్లడించింది కులదీప్ నయ్యర్. జిన్నాతోపాటు లాహోర్ వచ్చిన పాక్ జర్నలిస్టు మరణించాక కొన్నేళ్లకు ఆయన భార్య చెప్పగా కులదీప్‌కు ఆ విషయం తెలిసింది.

– ఎస్. వెంకట నారాయణ, సీనియర్ పాత్రికేయులు

*○ మావో పాలన, మోదీ ప్రభుత్వం మధ్య ఎన్నో పోలికలు మనలను చకితపరుస్తాయి. కార్యకర్తలను హింసాత్మక దాడులకు ఉసిగొల్పడానికి సంస్కృతిని ఒక సమర్థక్షేత్రంగా ఉపయోగించుకోవడం, వ్యక్తి ఆరాధనను పెంచేందుకు చారిత్రక అన్యాయాలను ఉపయోగించుకోవడం, మేధో వ్యాసంగాలను వ్యతిరేకించడం, కట్టుకథలను సృష్టించడం, సత్యాన్ని భావజాలానికి అధీనం చేయడం మొదలైన ఉమ్మడి లక్షణాలెన్నో ఉన్నాయి. ఎత్తుగడలు, కార్యాచరణ పద్ధతుల్లో సారూప్యాల గురించి చెప్పనవసరమే లేదు. మోదీ ప్రభుత్వ సమర్థకులు తమ వ్యతిరేకులలో కొంతమందిని 'పట్టణ మావోయిస్టులు' అని అభివర్ణించడం ఒక రమణీయ విరోధభాస! అయితే మావోయిస్టు భారతదేశ ప్రజాస్వామిక సంప్రదాయాలు, రాజ్యాంగబద్ధ ప్రభుత్వ వ్యవస్థ ఆలంబనగా మోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ కారణంగా మావోయిస్టు పాలనలో చోటు చేసుకున్న తీవ్ర చర్యలు ఇక్కడ సంభవించడానికి అంతగా అవకాశం లేదు.*

*– అసీం అలీ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ముంబయి*

**○ తెలంగాణ పౌరసమాజానికి దేశవ్యాప్తంగా, ఇతర దేశాల్లోని మేధావి, రాజకీయ వర్గాల్లో కూడా ఎప్పటి నుంచో మంచి గుర్తింపు ఉంది. ఇది ఎంతో చైతన్యవంతమైన సమాజమన్నది వారందరి అభిప్రాయం. అటువంటి గుర్తింపు అర్థం ఆ సమాజంలో పోరాటశీలత ఉన్నదనే కాదు, నిర్మాణాత్మకత ఉందని. నిర్మాణ దృష్టిలేని పోరాటశీలతకు అర్థం ఉండదు. ఆ రెండు పడుగుపేకల వలె కలిసి సాగినప్పుడే సార్థకత ఉంటుంది. ఎందువల్లనోగాని ఈ దృష్టి 2014 తర్వాత కనిపించవలసినంత స్థాయిలో కన్పించటం లేదు. దీనిపై తెలంగాణ సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాలి.**

**- టంకశాల అశోక్, సీనియర్ పాత్రికేయులు**

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, ది వైర్, సోషల్ మీడియా) ⌘





# అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందితేనే దేశాభివృద్ధి

పాఠశాలల్లో అందరికీ నాణ్యమైన విద్య, ప్రాథమిక స్థాయి నుంచి ఆస్పత్రుల్లో మందులు, వైద్యులు, వసతుల కొరత తీరి అందరికీ మంచి వైద్యం.. ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా అందినప్పుడే దేశ సుస్థిరాభివృద్ధి జరుగుతుందని జేపీ అన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా కర్నూలు జిల్లా దేవనకొండ జిల్లా పరిషత్ హైస్కూలును ఆయన సందర్శించారు. విద్యార్థులకు విషయాల్ని వివరిస్తూ ప్రశ్నిస్తూ, వారి ప్రశ్నలకు జవాబులిస్తూ సురాజ్య లక్ష్యాల అవసరాన్ని వివరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజుకు మన పేరు మీద ఎంత ఖర్చు చేస్తున్నాయి? అని జేపీ తొలుత ప్రశ్నించారు. సమాధానంగా రూ.11వేల కోట్లు అని విని విద్యార్థులు ఆశ్చర్యపోయారు.

11వేల కోట్లు పక్కన ఎన్ని సున్నాలు ఉంటాయి అని ఆ తర్వాత జేపీ అడిగారు. పలువురు విద్యార్థులు తడుముకున్నారు. ఎన్ని సున్నాలు ఉంటాయో కూడా మనలో చాలామంది వెంటనే చెప్పలేనంత డబ్బును ప్రభుత్వాలు రోజూ మన పేరు మీద ఖర్చు చేస్తున్నాయి, ఇదంతా మన డబ్బే అని చెప్పినప్పుడు విద్యార్థులు మరింత కంగుతిన్నారు.

ఇంత డబ్బును ఖర్చు చేస్తుంటే, ప్రభుత్వాలు అందించాల్సిన విద్య, ఆరోగ్యం అధ్వాన్నంగా ఉండటం వల్లే మనదేశం సరిగా అభివృద్ధి చెందటం లేదని జేపీ వివరించారు. భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశమని తాను చిన్నప్పటి నుంచీ చదువుకుంటున్నానని, ఇప్పటికీ అలాగే అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉందని అన్నారు. గత 70ఏళ్లుగా మన పొరుగున ఉన్న దేశాలు మనల్ని దాటి వెళ్లిపోయాయని, మనం మాత్రం వెనకబడి ఉన్నామని అన్నారు. కేవలం విద్య, ఆరోగ్యం, మౌలికవసతులు, లంచాల్లేని సేవలు, స్థానికంగా అధికారాలు వంటివి అందించే పాలన లేకపోవటమే ఇందుకు ప్రధాన కారణమన్నారు.

లోక్‌సత్తా చాలాకాలంగా ఈ విషయాన్ని వివరిస్తోందని, ఇటీవల ఆంధ్రప్రదేశ్‌కి వచ్చినప్పుడు బిల్‌గేట్స్ కూడా ఇదే మాట చెప్పారని గుర్తుచేశారు. విద్య, ఆరోగ్యం లేకుండా మనలో ఎవరైనా ఎదగగలరా? ఏ దేశమైనా అభివృద్ధి చెందిందా? అని జేపీ ప్రశ్నించారు. ప్రజలకు భారం లేకుండా విద్య, ఆరోగ్యం అందించటం ప్రతి ప్రభుత్వం బాధ్యతని, ఈ లక్ష్యాల కోసం సురాజ్య యాత్ర ద్వారా పోరాడాల్సి వస్తోందని అన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు గణితం పాఠ్యాంశంలోని లంబత్రిభుజ కోణ వృత్తాల గురించి ఈ సందర్భంగా బోర్డు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

పాఠశాల కార్యక్రమం అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జేపీ సందర్శించారు. అక్కడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది రోగులతో మాట్లాడారు. మందుల కొరత ఎందుకుందని వైద్యాధికారి శ్రీమంత్ మాదన్నను అడిగారు. వైద్యరంగాన్ని బాగుచేస్తేనే దేశంలో పేదరికం పోతుందని, కోట్లమందికి ఉపాధి వచ్చే అవకాశాలు మెరుగవుతాయని జేపీ అన్నారు. తనకు పదవుల మీద ఆశలేదని, ప్రతిష్టను పట్టించుకోనని, కేవలం ప్రజల శ్రేయస్సు కోసమే పనిచేస్తున్నానని వివరించారు. గత నాలుగు దశాబ్దాల ట్రాక్ రికార్డే ఇందుకు నిదర్శనమన్నారు. ఇప్పుడు కూడా జనహితం కోసం విద్య, వైద్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు, చట్టబద్ధపాలన, వ్యవసాయంలో ఆదాయం లక్ష్యాలుగా సురాజ్య యాత్ర చేస్తున్నామన్నారు.

**జేపీకి పలువురి వినతి పత్రాలు**

చాలీచాలని వేతనాలతో దుర్భర పరిస్థితుల మధ్య జీవనం సాగిస్తున్న తమ సేవలను క్రమబద్ధీకరించేలా చూడాలని, తమ కుటుంబాలలో వెలుగులు నింపాలని గ్రామపంచాయతీ ఒప్పంద కార్మికులు జేపీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒప్పంద కార్మిక సంఘం నాయకులు మనోహర్, నరసన్న తదితరులు వినతిపత్రం ఇచ్చారు. అందరికీ వేతనాలు అందేలా చూడాలన్నారు. అలాగే పీఈటీ, పీటీ పోస్టులను భర్తీ చేయాలని 400:1 నిష్పత్తిలో నియామకాలు చేయాలని వ్యాయామ కోర్సు పట్టభద్రులు కోరారు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సర్వశిక్ష అభియాన్‌లో 128 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆనందాచారి, నాగరాజు, బ్రహ్మయ్య, జయరాముడు తదితరులు పాల్గన్నారు. పట్టణంలో సమస్యలపై యువస్పందన సభ్యులు జేపీకి వినతిపత్రాలు ఇచ్చారు. ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్ట్‌పై పనిచేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది తమ సమస్యలపై విజ్ఞాపన అందచేశారు. పత్తికొండ ఆర్ అండ్ అతిథిగృహంలో బుడగజంగాల నాయకులు జేపీని కలిశారు. తమకు కులధృవీకరణ పత్రాలు ఇవ్వటం లేదని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జేపీ హామీ ఇచ్చారు.

మీద జేపీ వివరించారు. తాను చూసిన చాలా పాఠశాలల్లో విద్యార్థులందరికీ తెలివితేటలు ఉన్నాయని, కానీ విషయాన్ని అర్థం చేసుకుని సొంతంగా పరిష్కారాలను చెప్పే శక్తి మాత్రం చాలా తక్కువగా ఉందని అన్నారు. విద్య అంటే ఇలా సొంతంగా పరిష్కారాల్ని చూపగలగటమని, ఇందుకోసమే లెక్కలు, భాషాపరిజ్ఞానం, విశ్లేషణ, తర్కం వంటివి పాఠ్యాంశాలలో ఉంటాయన్నారు. ప్రపంచంలో ఎవరితోనైనా పోటీపడి ఎదగగలిగే స్థాయిని అందుకోవాలంటే బట్టీపట్టకుండా అర్థం చేసుకుంటూ, చుట్టుపక్కల పరిస్థితులకు అన్వయం చేసుకుంటూ చదువుకోవాలన్నారు. విద్యారంగంలో బాలికలు ముందుకు దూసుకొస్తున్నారని కితాబిచ్చారు. మూఢనమ్మకాలను వీడాలని, సాంకేతికతను, క్రమశిక్షణను, సృజనాత్మకతను జోడించి మంచి ప్రమాణాల చదువు కోసం పట్టుబట్టాలన్నారు.

దేవనకొండ మండల లోక్‌సత్తా నాయకులు తొలుత జేపీకి ఘనస్వాగతం పలికారు. లోక్‌సత్తా, పౌరసమాజ నేతలు రామ్మోహనరావు, బాబ్జీ, రామకృష్ణారెడ్డి, రామదాస్ గౌడ్, రాజ్యలక్ష్మి, దేవిడ్, వసంతకుమార్, యశ్వంత్‌కుమార్, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ✶

## ప్రభుత్వాల విధానాల వల్ల ఛిన్నాభిన్నమైన ఆర్థికరంగం, మన సమస్యలను మనమే పరిష్కరించుకునే వ్యవస్థ కావాలి


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్లే ఆర్థిక పరిస్థితులు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, వేగంగా ఎదగాల్సిన దేశం ఆర్థిక సంక్షోభ ప్రమాదాన్ని ఎదుర్కొంటోందని జేపీ అన్నారు. పాలకుల్లో మార్పు వస్తే తప్ప ఆర్థిక అసమానతలు తొలగవన్నారు.

కర్నూలు జిల్లా సురాజ్య యాత్రలో భాగంగా కోడుమూరులో చేనేత కార్మికుల సమస్యల అధ్యయనం అనంతరం స్థానిక ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు లింగం బాలకిట్టు ఇంట్లో, ఆలూరులోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మీడియాతో జేపీ మాట్లాడారు.

మనదేశ భక్తి సరైన దిశలో, అవగాహనతో లేకపోవటం వల్ల చేనేత కార్మికుల దగ్గర్నుంచి అన్నివర్గాల ప్రజలూ అవస్థలు పడుతున్నారని జేపీ అన్నారు. విదేశాల నుంచి మంచిని నేర్చుకుని అందరికీ విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, లంచాల్లేనిసేవలు, స్థానికంగా అధికారాలు వంటివి అందించకుండా.. విదేశాల ముందు దాసోహం అనేలా మన పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. ధర ఎక్కడుంటే అక్కడ అమ్ముకునే విధంగా రైతుల్ని ప్రోత్సహించాల్సిన పాలకులు.. రైతులను దెబ్బకొట్టేలా ఎగుమతి, దిగుమతి విధానాలను అనుసరిస్తున్నాయన్నారు. వీటిని మార్చేందుకే సురాజ్య యాత్ర అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా జనం బతుకులు మారటం లేదని, ఎన్నికల్లో వేరే పార్టీల్ని గెలిపించటం పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అవుతోందన్నారు. విధానాల్లో అన్ని పార్టీలూ ప్రజావ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రజలు ఎదిగే అవకాశాలున్న విధానాలను అమలుచేయకుండా, వారు నిరంతరం యాచించేవారుగా ఉండేలా తాత్కాలిక తాయిలాల్ని ప్రకటిస్తున్నారన్నారు. విద్య, ఆరోగ్యం, స్థానికంగా అధికారాలు ఉంటే ఆదోనిలోనే చాలామంది యువతకు ఉపాధి లభించి ఉండేదన్నారు. చాలా సమస్యలకు పరిష్కారం అమరావతి, హైదరాబాద్, ఢిల్లీల్లో ఉండదని, అందుకే జనం ఉండే చోటకే నిధుల్ని, అధికారాల్ని ఇవ్వాలని ప్రజలు కోరాలన్నారు. సురాజ్య యాత్రలో బైటపడ్డ సమస్యల్ని, పరిష్కారాల్ని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, కేంద్ర ప్రభుత్వానికీ అందచేస్తానన్నారు. సమస్యల్ని పరిష్కరించకపోతే ప్రజలు తిరగబడతారన్నారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదై సురాజ్య లక్ష్యాల కోసం కృషి చేయాలన్నారు.

రామ్మోహనరావు, బాబ్జీ, రాజ్యలక్ష్మి, వసంతకుమార్, రాంగౌడ్, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ✶





# # Support LOCAL COURTS for WOMEN SAFETY

## (మహిళల భద్రత కోసం తక్షణం 'స్థానిక కోర్టుల్ని' ఏర్పాటు చేయాలి)

'షీ టీమ్' లను ఏర్పాటు చేసినా, చట్టాలను కఠినతరం చేసినా తెలుగు రాష్ట్రాల్లో మహిళలు, బాలికలపై అత్యాచారాలు ఆగడం లేదు. చాలా సందర్భాల్లో దోషులకు శిక్షలు కూడా పడకపోవడంతో నేరస్తులు ఇంకా రెచ్చిపోతున్నారు.

మహిళలపై వేధింపుల దశలోనే వేగంగా కేసుల్ని విచారించి, కొద్దిరోజుల వ్యవధిలోనే చిన్న శిక్షలతో చర్యలు తీసుకునే ఏర్పాటు ఉంటే... అత్యాచారాల దాకా తెగించే ధోరణులు గణనీయంగా తగ్గుతాయి. తోటకూర దొంగతనంనాడే బుద్ధి చెప్పినట్లవుతుంది. ఇందుకోసం 'స్థానిక కోర్టుల్ని' ఏర్పాటు చేయటం అవసరం.

మహిళల భద్రతకు ఎంతో ఉపయోగపడే 'స్థానిక కోర్టుల్ని' ఏర్పాటు చేయటానికి అవసరమైన 'గ్రామ న్యాయాలయాల' చట్టాన్ని 2008-09లోనే లోక్‌సత్తా సాధించింది.

గ్రామన్యాయాలయాల చట్టం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వెంటనే స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయాలి.

దేశవ్యాప్తంగా 5,000 స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేస్తే... భారత్‌లో కూడా అత్యాచారాల నిరోధానికి ఓ పటిష్ఠ మార్గం ఏర్పడుతుంది. ఈ కోర్టుల ద్వారా ఇతరత్రా చిన్న చిన్న కేసుల్లో కూడా తీర్పులు వెంటనే వెలువడుతూ సామాన్య ప్రజలకు తేలిగ్గా, చవగ్గా న్యాయం అందుబాటులోకి వస్తుంది. స్థానిక కోర్టులు + ఇతర కొన్ని సంస్కరణలతో చట్టబద్ధపాలన బలోపేతమై మహిళలు, బాలికల భద్రతకు భరోసా ఏర్పడుతుంది.

(Share this message widely.
Details at: http://www.fdrindia.org/judicial-reforms/)

Posting Date 22-09-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on September 16th, 2018




ప్రతి ఒక్కరి,
ప్రతి ఇంటీ పుస్తకం

తప్పక చదవండి,
చదివించండి

పేజీలు : 64

వెల : రూ. 20/-

**Book-Post**
PRINTED MATTER

To

If not delivered please return to:

**Lok Satta Times**
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad